WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 185 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 29 జూన్ 2025 | వెల : 2-00

# బాబు గారూ.. బెల్టు ఎప్పుడు తీస్తారు

- బెల్టు దుకాణాలపై ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖతార్
- వాకాడు మండలంలో ఏరులై పారుతున్న మద్యం
- ఓ గ్రామానికి ఐదుకు తక్కువ కాకుండా వెలసిన బెల్ట్ దుకాణాలు
- ప్రతి బెల్ట్ దుకాణం నుంచి రూ. 5 వేలు వసూలు చేస్తున్న ఎక్సైజ్ సీఐ
- అక్రమ బెల్ట్ దుకాణాలతో సిండికేట్లకు కోట్లు




స్వర్ణసాగరం వాకాడు

ప్రభుత్వ రాబడి పెంచేందుకు మద్యం పాలసీ విధానాన్ని మార్పు చేశాం. మద్యం దుకాణంలో మాత్రమే మద్యం విక్రయించాలి. కాదని ఎవరైనా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేస్తే నేను బెల్ట్ తీయాల్సి వస్తుంది. ఇది ఓ బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ఏడాది నవంబర్ 1వ తేదీన బెల్ట్ దుకాణాలపై చేసిన వ్యాఖ్యలు. కానీ ముఖ్యమంత్రి ఆదేశాలను పెడచెవిన పెట్టిన వాకాడు ఎక్సైజ్‌శాఖ పరిధిలోని మద్యం దుకాణదారులు ఎక్సైజ్‌శాఖ అధికారుల అండదండలతో గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి అక్రమ సంపాదనకు తెర తీశారు.

గత వైసిపి ప్రభుత్వం ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపేది. అయితే ఈ మద్యన దుకాణాలలో గత ప్రభుత్వం నాసిరకమైన మద్యం సరఫరా చేస్తుందని భావించిన కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులతో మద్యం దుకాణాలు నడిపించేందుకు శ్రీకారం చుట్టింది. అధికారం చేపట్టిన నాలుగు నెలలకే నూతన మద్యం పాలసీ విధానాన్ని తీసుకువచ్చి టెండర్లు పిలిచి ప్రైవేటు వ్యక్తుల ద్వారా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ మద్యం దుకాణాలకు టెండర్లు వేసిన విధానం ఎలా జరిగిందో ప్రజలందరకి తెలిసిన విషయమే. ప్రస్తుతం మద్యం దుకాణాలను నడిపిస్తున్న సిండికేట్ వ్యక్తులు ఏ పార్టీకి చెందినవారో కూడా అందరికీ విధితమే. ఏదోలా మద్యం దుకాణాలను సొంతం చేసుకున్న సిండికేట్ దారులు తాము పెట్టిన పెట్టుబడి వెంటనే రాబట్టుకునే మార్గాలకు తెరతీశారు. వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులతో చేతులు కలిపి పర్సంటేజీలతో ఒప్పందం కుదుర్చుకొని ప్రతి గ్రామంలో కనీసం ఐదు బెల్ట్ షాపులకు తక్కువ లేకుండా వారికి అనువైన వారికి మాత్రమే విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. ఈ బెల్ట్ షాపులకు వీరే అధి కారిక షాపు నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు.

**బెల్ట్ షాపులు నడుస్తున్నాయి ఇలా..!**

గ్రామంలో ఎవరైతే బెల్ట్ షాప్ పెట్టాలనుకున్నారో వారు ఆ గ్రామానికి సమీపంలో ఉన్న మద్యం దుకాణం నడుపుతున్న సిండికేట్ వ్యక్తులతో చర్చించాలి. ప్రతి రోజు మద్యం సరఫరా చేసేందుకు రవాణా ఖర్చులతో పాటు అధిక ధరలకు మద్యం విక్రయించేందుకు అనుమతి ఇస్తూ ఓ పర్సంటేజ్ నిర్ణయించుకొని బెల్ట్ షాపుకు అనుమతులు చేస్తారు. ఇక అప్పటి నుంచి ఆ బెల్ట్ షాపుకు ఆర్డర్లపై రోజు మద్యం సరఫరా చేస్తారు. వాకాడు మండలంలోని 19 పంచాయతీలలో ఇలా ఏర్పాటైన బెల్ట్ దుకాణాలు 60కి పైగా ఉన్నాయంటే వీరి వ్యాపారం ఏ విధంగా సాగుతుందో అర్థం చేసుకోవాలి. విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయడమే కాకుండా సిండికేట్ దారులకు అధిక మొత్తంలో పర్సంటేజీలు ఇవ్వాల్సి ఉండటంతో బెల్ట్ విక్రయదారుడు ప్రతి క్వార్టర్ పై 20 నుంచి 30 రూపాయల వరకు అదనంగా మద్యం అమ్ముతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలో ఈమద్యం పాలసీ వలన ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ఏర్పాటు చేసిన నూతన మద్యం ....

3



## ఐఎస్ఎస్ నుంచి శుభాంశు వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

- శుభాంశు శుక్లాకు ప్రధాని మోదీ దశుభాకాంక్షలు
- అక్కడ మిషన్ విజయవంతం కావాలి
- భవిష్యత్‌లో శుభాంశు శుక్లా మరిన్ని విజయాలు సాధించాలి


# ఆగస్ట్ 15వ తేదీ నుంచే మహిళలకు ఉచిత బస్సు

- మరో పథకానికి డేట్ ఫిక్స్..
- ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన
- మహిళలకు ఉచిత బస్సు పథకంపై సంబంధిత అధికారులతో చర్చ
- ఈ పథకం అమలు చేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్లుగా బస్సులు నడిపించాలి
- తమ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15వ తేదీ నుంచే ఈ పథకం అమలు చేయాలి
- ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ, ఏసీ బస్సులే ఉండాలి




స్వర్ణసాగరం అమరావతి

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళా శక్తి పేరిట ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం హామీపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో మహిళలకు ఉచిత బస్సు పథకంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ఈ పథకం అమలు చేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్లుగా బస్సులు నడిపించాలని సూచించారు. తమ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా ఆగస్ట్ 15వ తేదీ నుంచే ఈ పథకం అమలు చేయాలని తెలిపారు. - మిగతా3లో



## స్వార్థ రాజకీయాల్లో జగన్ నెంబర్ వన్

- మోదీ హయాంలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ: షర్మిల

స్వర్ణసాగరం కాకినాడ

స్వార్థ రాజకీయాలు చేసే వారిలో జగన్‌మోహన్‌రెడ్డి నెంబర్ వన్ స్థానంలో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మహా సముద్రంలాంటి కాంగ్రెసలో పిల్ల కాలువల్లాంటి పార్టీలన్నీ కలవాల్సిందేనన్నారు. కాకినాడ జిల్లాలో పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి శనివారం ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా కాకినాడలోనూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోనూ ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో అవసరమని షర్మిల చెప్పారు. అధికార టీడీపీ, జనసేన, ప్రతిపక్ష వైసీపీ ఇలా అన్ని పార్టీల వారు బీజేపీకి తొత్తులుగా మారి పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. మోదీకి అంత గులాంగిరీ చేయాల్సిన అవసరం ఈ పార్టీలకు ఎందుకు వచ్చిందని ప్రశ్నిం చారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీని వ్యతిరేకించారని తెలిసి కూడా అదే మోదీకి జగన్ దత్తపుత్రుడిగా మారారన్నారు. - మిగతా3లో




## రా చీఫ్‌గా పరాగ్ జైన్

- ప్రస్తుత 'రా' చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30వ తేదీతో ముగియనుంది.
- జూలై 1న పరాగ్ జైన్ కొత్త చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు
- పస్తుతం ఆయన ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ అధిపతిగా సేవలందిస్తున్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గింది

- సాంకేతికత వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందంజలో ఉంది
- మోడల్ పోలీసు స్టేషన్లు జిల్లా మొత్తం విస్తరించాలని..
- సురక్ష యాప్, సురక్ష డివైస్‌ల వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతుంది
- హోంమంత్రి వంగలపూడి అనిత



## దేశంలోనే తొలి డిజిటల్ హైవే

- నిబంధనలు ఉల్లంఘిస్తే క్షణాల్లో చలాన్!
- ముున్ముందు ఇవి స్మార్ట్‌రూపు సంతరించుకోబోతున్నాయి

# దేశంలోనే తొలి డిజిటల్ హైవే

**ఇంటర్నెట్ డెస్క్:** జాతీయ రహదారుల రూపు మారుతోంది. వాహనదారులు రయ్ రయ్‌మని దూసుకెళ్లేలా సువిశాలమైన రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. మున్ముందు ఇవి స్మార్ట్‌రూపు సంతరించుకోబోతున్నాయి. తాజాగా దిల్లీ–గురుగ్రామ్‌ను కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఏఐ సాయంతో పనిచేసే అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఏటీఎంఎస్ రూపుదిద్దుకుంది. ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ దీన్ని అభివృద్ధి చేసింది. దీన్ని అమలు చేసే బాధ్యత ఎన్‌హెచ్‌ఏఐ చూస్తుంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు ఎన్‌హెచ్–48పై 28 కిలోమీటర్ల మేర అత్యాధునిక నిఘా వ్యవస్థను జోడించారు. మొత్తంగా 56.46 కిలోమీటర్ల మేర రహదారిపై ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. తద్వారా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ కలిగిన డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. ట్రాఫిక్ మానిటరింగ్, ప్రమాదాల గుర్తింపు ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం.

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే..**

ఈ రహదారిపై సీటు బెల్టు ధరించకుండా ప్రయాణిస్తే అత్యాధునిక కెమెరాలు తక్కున పట్టేస్తాయి. ట్రిపుల్ రైడింగ్, పరిమితికి మించిన వేగం వంటి 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను ఈ ఏటీఎంఎస్ వ్యవస్థ పసిగడుతుంది.

ఈ అత్యాధునిక వ్యవస్థకు NIC ఇ–చలాన్ పోర్టల్ కూడా అనుసంధానమై ఉంటుంది. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పోలీసు అధికారులకు ఆ సమాచారం చేరవేస్తుంది.

రోడ్డు భద్రతపై ఎన్‌హెచ్‌ఏఐ అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఏటీఎంఎస్ ద్వారా రోడ్డు వినియోగం, రహదారి భద్రత గురించి ప్రజలకు అవగాహన



కల్పించనున్నారు.


ఈ రహదారిపై ఒక్కో కిలోమీటర్‌కి ఒకటి చొప్పున మొత్తం 110 హై రిజల్యూషన్ పీటీజడ్ కెమెరాలను అమర్చారు. ఇవి 24 గంటలూ రహదారిపై నిఘా ఉంచుతాయి.

ఏటీఎంస్ అనేది ఐదు రకాల వ్యవస్థలు ఉంటాయి. ట్రాఫిక్ మానిటరింగ్, ప్రమాదాల వీడియోల చిత్రీకరణ, వాహన వేగం, వివిధ సందేశాలతో కూడిన సైన్ బోర్డులు, సెంట్రల్ కంట్రోల్ రూమ్ వంటివి ఇందులో ఇమిడి ఉంటాయి.

ఇందులోని కమాండ్ సెంటర్ అనేది డిజిటల్ బ్రెయిన్‌గా వ్యవహరిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే స్థానిక, జాతీయ రహదారి సిబ్బందికి సమాచారం అందిస్తుంది. దట్టమైన పొగమంచు ఏర్పడడం, రహదారిపై అడ్డంకులు ఏర్పడినప్పుడు, రహదారులపైకి జంతువుల ప్రవేశించినప్పుడు సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై అమలు చేసిన ఈ ఆటోమేటెడ్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై అమలు చేయాలని కేంద్రం యోచిస్తోంది. అదే జరిగితే మన జాతీయ రహదారులు మరింత ఆధునికతను సంతరించుకోనున్నాయి.

## ఐఎస్ఎస్ నుంచి శుభాంశు.. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా ఖ్యాతి పొందిన శుభాంశు శుక్లాతో ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటించారు. శనివారం, జూన్ 28) ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం 'ఎక్స్' లో పోస్ట్ చేసింది. శుభాంశు శుక్లాకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారని, అక్కడ మిషన్ విజయవంతం కావాలని, భవిష్యత్‌లో శుభాంశు శుక్లా మరిన్ని విజయాలు సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు శుభాంశుతో మోదీ మాట్లాడుతున్న ఫోటోను షేర్ చేసింది పీఎం కార్యాలయం. కాగా, భారత కాలమానం ప్రకారం బుధవారం(జూన్ 25) మధ్యాహ్నం 12 గంటలు దాటి ఒక నిమిషం. అమెరికాలో ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్. పదేపదే వాయిదాల అనంతరం, యాగ్జియం–4 మిషన్ వాణిజ్య మిషన్‌ను వెంట తీసుకుని స్పేస్‌ఎక్స్ ఫాల్కన్–9 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. కాసేపటికే యాగ్జియం–4 క్యాప్సూల్ రాకెట్ నుంచి విడివడింది. మొత్తమ్మీద 10 నిమిషాల్లోనే భూమికి 200 కి.మీ. ఎగువ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించింది. మిషన్ పైలట్‌గా 140 కోట్ల పై చిలుకు భారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ మన వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్‌గా శుభాంశు శుక్లా సగర్వంగా రోదసిలోకి ప్రవేశించారు. ఫలితంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా శుభాంశు చరిత్ర సృష్టించారు. అయితే 14 రోజుల పాటు ఇక్కడ పరిశోధనలు చేయనుంది శుభాంశు బృందం.

## రా చీఫ్‌గా పరాగ్ జైన్




న్యూఢిల్లీ: రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ కొత్త చీఫ్‌గా పంజాబ్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు. ఆయన రెండేళ్ల పాటు పదవీకాలంలో కొనసాగుతారు. ప్రస్తుత 'రా' చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30వ తేదీతో ముగియనుంది. దీంతో జూలై 1న పరాగ్ జైన్ కొత్త చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు. పస్తుతం ఆయన ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ అధిపతిగా సేవలందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో జైన్ కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్ మిలటరీ కదలికలు, ఉగ్ర స్థావరాలు వంటి కీలక ఇంటెలిజెన్స్ సమాచారం సేకరణలో ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు.

**పరాగ్ జైన్ ఎవరు?**

పంజాబ్ క్యాడర్ 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్‌కు వ్యూహాత్మక ఇంటెలిజెన్స్ వర్క్, ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్‌లో విశేషానుభవం ఉంది. ప్రస్తుతం 'రా'లో ఆయన రెండవ మోస్ట్ సీనియర్‌గా ఉన్నారు. 'రా'లో 15 ఏళ్లుగా అంకిత సేవలందిస్తూ.. భారతదేశ కౌంటర్ టెర్రరిజం ఆర్కిటెక్చర్‌గా కీలక భూమిక పోషిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్‌లో సైతం పరాగ్ తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారు. దీనికి ముందు చండీగఢ్‌లో సీనియర్ సూపరింటెండెంట్‌గా కూడా పని చేశారు. గ్లోబల్ ఇంటెలిజెన్స్ అనుభవం కూడా జైన్‌కు విశేషంగా ఉంది. కెనడాలోని అట్టావాలో ర్యాడికల్ సిక్కు వేర్పాటువాద నెట్‌వర్క్‌ను ట్రాక్ చేయడంలోనూ కీలక పాత్ర పోషించారు. శ్రీలంకలోనూ దౌత్య ప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

# బయో ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటు ఇక మరింత ఈజీ

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో బయో ఎనర్జీ విస్తరణకు మరింత ఊతమిచ్చేలా వేగంగా చర్యలు చేపడుతున్నారు. కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ శనివారం దీనికి సంబంధించి సవరించిన మార్గదర్శకాలను ప్రకటించింది. మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పనితీరు ఆధారిత పర్యావరణ వ్యవస్థను సృష్టించడమే లక్ష్యంగా కొత్త సవరణలను తీసుకొచ్చారు. జాతీయ బయోఎనర్జీ కార్యక్రమం కింద వ్యర్థాల నుండి శక్తి ని ఉత్పత్తి చేసే కార్యక్రమానికి ఇవి ఎంతో సహకరిస్తాయి. కొత్తగా తెచ్చిన సవరణలు వల్ల ఉపయోగం ఏంటంటే, ఈ ప్లాంట్స్ పెట్టాలనుకునే వాళ్లకి ఫ్రేమ్‌వర్క్ ప్రక్రియ సులభతరమవుతుంది. ఈ ప్రాజెక్టులు పెట్టడానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని వేగంగా అందిస్తారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలకు, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న ఇంకా మధ్య తరహా సంస్థలకు ఫ్రెండ్లీ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ క్రియేట్ చేయడమే దీని ప్రధాన లక్ష్యం.

అంతేకాక, ఈ సవరించిన మార్గదర్శకాలు, ప్లాంట్ల ఏర్పాటుకు డాక్యుమెంటేషన్ వర్క్‌ని బాగా తగ్గిస్థాయి. తద్వారా ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు త్వరితగతిన వస్తాయి. కంప్రెస్డ్ బయోగ్యాస్ బయోగ్యాస్, విద్యుత్ ఉత్పత్తిని మెరుగుపరచ



డానికి ఈ సవరణలు వీలు కల్పిస్తాయి. తద్వారా 2070 నాటికి నికర–సున్నా ఉద్గారాలను సాధించాలనే భారతదేశ లక్ష్యం చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. బయో ఎనర్జీ అనేది జీవ సంబంధమైన (బయోమాస్) పదార్థాల నుండి ఉత్పత్తి అయ్యే శక్తి. ఇది పునరుత్పాదక శక్తి వనరు, ఇది మొక్కలు, చెట్లు, వ్యవసాయ వ్యర్థాలు, జంతు వ్యర్థాలు, ఇంకా ఇతర సేంద్రీయ పదార్థాల నుండి తయారవుతుంది. ఆయా పదార్థాలను దహనం, లేదా ఇతర ప్రక్రియల ద్వారా శక్తిగా మార్చవచ్చు.

**బయో ఎనర్జీ రకాలు:**

బయోఫ్యూయల్స్: బయోఎథనాల్, బయోడీజిల్ వంటివి, ఇవి రవాణా కోసం ఉపయోగించబడతాయి.

బయోగ్యాస్: సేంద్రీయ వ్యర్థాల నుండి ఉత్పత్తి అయ్యే మీథేన్ వాయువు, వంట ఇంకా విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడుతుంది.

బయోమాస్ ఎనర్జీ: చెక్క, వ్యవసాయ అవశేషాలు, లేదా ఇతర సేంద్రీయ పదార్థాలను దహనం చేసి వేడి లేదా విద్యుత్ ఉత్పత్తి చేయడం.

ప్రయోజనాలు:

పునరుత్పాదకం మరియు పర్యావరణ అనుకూలమైనది.

ఫాసిల్ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

వ్యర్థాలను ఉపయోగించడం ద్వారా వ్యర్థ నిర్వహణకు సహాయపడుతుంది.

**ఉదాహరణలు:**

చెరకు నుండి బయోఎథనాల్ తయారీ.

గోబర్ గ్యాస్ ప్లాంట్ల ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి.

# 20 ఏళ్ల తర్వాత థాక్రే బ్రదర్స్ రీయూనియన్.. దేనికి సంకేతం?

మహారాష్ట్ర రాజకీయాల్లో త్వరలో కీలక పరిణామం చోటు చేసుకోబోతోందా?. రాజకీయంగా తీవ్ర విభేదాలతో రెండు దశాబ్దాలపాటు దూరంగా ఉన్న సోదరులు ఉద్దవ్ థాక్రే, రాజ్ థాక్రే.. ఒకే వేదికను పంచుకోబోతుండడమే ఇందుక కారణం. ఈ బ్రదర్స్ రీయూనియన్‌పై ఇప్పుడు మరాఠానాట ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) కింద త్రిభాషా సూత్రం అమలులో భాగంగా.. పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేయడాన్ని నిరసిస్తూ విపక్షాలు జులై 5వ తేదీన నిరసనకు పిలుపు ఇచ్చాయి. ఈ కార్యక్రమానికి శివసేన ఉద్దవ్ థాక్రే వర్గం(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధినేతలు మద్దతు ఇవ్వబోతున్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్' పోస్టులో శివసేన (యూబీటీ)ఎంపీ, ప్రతినిధి సంజయ్ రౌత్ తెలియజేశారు. తొలుత ఈ రెండు పార్టీలు ఈ అంశంపై వేర్వేరుగా నిరసనలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత ఇద్దరు నేతలు మరాఠీల ప్రయోజనం కోసం వేర్వేరు నిరసనలు నిర్వహించడం సముచితం కాదని గ్రహించి,



నిరసన ప్రదర్శనలను సంయుక్తంగా నిర్వహించాలని ప్రతిపాదించారు. మహారాష్ట్ర సర్కారు మరాఠీ , ఇంగ్లీష్–మీడియం పాఠశాలల్లో ఒకటి నుండి ఐదు తరగతుల వరకు హిందీని తప్పనిసరి మూడవ భాషగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనిపై పలు వర్గాల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే సోదరుడు శ్రీకాంత్ థాక్రే తనయుడే రాజ్ థాక్రే. శ్రీకాంత్ థాక్రే రాజకీయాల్లో క్రియాశీలకంగా లేనప్పటికీ.. ఆయన తనయుడు రాజ్ థాక్రే.. బాల్ థాక్రే వారపత్రిక మార్మిక్లో కార్టూనిస్ట్‌గా పనిచేశాడు. అక్కడి నుంచే ఆయన రాజకీయ ప్రస్థానానికి పునాది పడింది. అయితే.. 90వ దశకంలో శివసేనలో రాజ్ థాక్రేకు మంచి ప్రజాదరణ ఉండేది. పార్టీ శ్రేణులు, బాల్ థాక్రే అభిమానులు రాజ్‌నే వారసుడిగా భావించేవారు. కానీ 2003లో బాల్ థాక్రే తన కుమారుడు ఉద్ధవ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాడు. దీంతో రాజ్ అసంతృప్తికి లోనయ్యారు. తదనంతర పరిణామాలతో.. 2006లో శివసేనను విడిచిపెట్టి మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అనే కొత్త పార్టీ స్థాపించారు. అప్పటి నుంచి ఈ సోదరుల మధ్య రాజకీయంగా తీవ్ర విభేదాలు కొనసాగాయి. దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత వీరిద్దరూ ఒకే సమస్యపై రాజకీయ వేదికను పంచుకోవాలనుకోవడం.. మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా భావిస్తున్నారు. ఇది తాత్కాలిక ఐక్యతా? లేక శివసేన పునఃఏకీకరణకు సంకేతమా?.. బీజేపీ రాజకీయంపై ఇది ఎలాంటి ప్రభావం చూపించబోతోందో?.. అంటూ మహారాష్ట్రలో జోరుగా చర్చ నడుస్తోంది.

## 'మేం కూడా స్నేహితులమే.. మరి మీరు తమిళం నేర్చుకోండి'



**చెన్నై:** హిందీ భాష అనేది ఎవరికీ శత్రువు కాదని, ఆ భాషను స్నేహపూర్వకంగా దక్షిణాది రాష్ట్రాలు చూడాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు డీఎంకే ఎంపీ కనిమొళి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. తాము హిందీ నేర్చుకోవడం సంగతిని కాసేపు పక్కన పెట్టి, ఉత్తరాది వారు తమిళం నేర్చుకుంటే బాగుంటుందని కనిమొళి స్పష్టం చేశారు. అలాగైనా తమిళ భాష జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు. 'మేం(తమిళులం) కూడా ఎవరికీ శత్రువులం కాదు.. మేం కూడా స్నేహితులమే. మా భాష కూడా అంతా నేర్చుకోవచ్చు. ప్రత్యేకంగా నార్త్ ఇండియన్స్ తమిళం నేర్చుకంటే బాగుంటుంది' అని అమిత్ షా పేరును ప్రస్తావించకుండానే తనదైన శైలిలో పేర్కొన్నారు. అంతకుముందు అమిత్ షా మాట్లాడుతూ.. హిందీ భాషను దేశంలోని ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలన్నారు. హిందీని ఎవరూ శత్రువుగా భావించొద్దని, అది ఏ భాషకు శత్రువు కూడా కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురాబోతున్న 'త్రిభాషా పాలసీ'లో హిందీని తప్పనిసరి చేయడానికి చూడటాన్ని కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇందులో తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలు హిందీ భాషను తమ రాష్ట్రాల్లో రుద్దడాన్ని ఒప్పుకోవడం లేదు. ఈ క్రమంలోనే తమిళనాడు సీఎం స్టాలిన్ సైతం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు తమిళం ఉండగా హిందీ ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ రాజకీయ దురుద్దేశాలతోనే హిందీని తమిళనాడులో పాతాలని చూస్తున్నారని ఇప్పటికే ఎన్నోసార్లు ధ్వజమెత్తారు. ఇప్పుడు అదే పార్టీకి చెందిన ఎంపీ కనిమొళి సైతం హిందీ భాషను తమ రాష్ట్రంలోకి తీసుకు రావడాన్ని ఖండించారు.

# ఎయిరిండియా ప్రమాదం: డీఎన్‌ఏ పరీక్షలు పూర్తి.. మృతుల సంఖ్య 260

ఇంటర్నెట్ డెస్క్: అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. డీఎన్‌ఏ పరీక్షల ద్వారా ఆఖరి మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్యను 260గా తేల్చారు. విమానంలోని 241 మంది సహా మొత్తం 270 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తొలుత అంచనా వేసినప్పటికీ.. చివరకు 260గా నిర్ధరించారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకున్న కాసేపటికే ఓ వైద్యకళాశాల వసతిగృహంపై కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ఒకరు మినహా మిగతా 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనాస్థలంలో ఉన్న పలువురూ మృతి చెందారు. శరీరాలు గుర్తుపట్టరాని విధంగా మారడంతో.. అధికారులు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించారు. దాదాపు రెండు వారాల తర్వాత ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. "విమాన ప్రమాదానికి సంబంధించి ఆఖరి మృతదేహానికి డీఎన్‌ఏ మ్యాచింగ్ పూర్తయ్యింది. అనంతరం కుటుంబ



సభ్యులకు అప్పగించాం" అని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.రాకేశ్ జోషి తెలిపారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 260కి చేరినట్లు వెల్లడించారు. అందరి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. గాయాలపాలైన మరో ముగ్గురు ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఎయిరిండియా ప్రమాదం.. దర్యాప్తు అధికారికి 'ఎక్స్' కేటగిరీ భద్రత వాస్తవానికి ఈ నెల 23 నాటికే 259 మంది మృతదేహాలను అధికారులు గుర్తించారు. 241 మంది విమాన ప్రయాణికుల మృతదేహాల్లో ఒకదాన్ని డీఎన్‌ఏ మ్యాచింగ్ కోసం పెండింగ్‌లో ఉంచారు. శుక్రవారం ఆఖరి మృతదేహం గుర్తింపును నిర్ధరించినట్లు తెలిపారు. 260 మంది మృతుల్లో 200 మంది భారతీయులు, 52 మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ జాతీయులు, ఒకరు కెనడియన్ ఉన్నట్లు చెప్పారు. "విమాన ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టరాని విధంగా మారాయి. ఎక్కువ సంఖ్యలో మృతులను గుర్తించాల్సి రావడంతో.. డీఎన్‌ఏ పరీక్షల ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ఇటువంటి సందర్భాల్లో మృతుల డీఎన్‌ఏను వారి కుటుంబ సభ్యుల నమూనాలతో సరిపోల్చేందుకు నెలల సమయం పడుతుంది. కానీ, ఈ కేసులో దాదాపు రెండు వారాల్లోనే పూర్తయ్యింది" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

# బాబు గారూ.. బెల్టు ఎప్పుడు తీస్తారు

-మొదటిపేజీ తరువాయి

పాలసీ విధానం సిండికేట్ దారుల అక్రమ సంపాదనకు అభాసుపాలవుతోంది.

**దోచుకుంటున్న ఎక్సైజ్ శాఖ..?**

నూతన మద్యం పాలసీ విధానం ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రధానంగా వాకాడు మండలంలో ఎక్సైజ్ శాఖ సిఐ పని తీరు ప్రభుత్వ ఆశయానికి తీవ్ర అప్రతిష్ట పాలు చేసేలా ఉంది. ఆయన వాకాడు మండలంలో సిఐగా విధుల్లో చేరినప్పటి నుంచి వివాదాస్పద పాలనకు తెర తీశారు. మద్యం సిండికేట్ దారులు విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంలో ఈ సీఐ పూర్తిగా అండదండలు అందించడంతో ప్రజల్లో బెల్టు దుకాణాలపై అసహనం వ్యక్తం అవుతుంది.

**సీఐ రెండు వైపులా సంపాదన..?**

బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేసేందుకు అనుమతి కోసం సిండికేట్ దారుల నుంచి వాకాడు ఎక్సైజ్ శాఖ సిఐ భారీ మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారు. అదేవిధంగా గ్రామాలలో బెల్ట్ షాపు నిర్వహించే వ్యక్తి నుంచి కూడా ఒక్కో షాపు నుంచి 5000 రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అంతేకాదు మద్యం దుకాణాల పక్కనే ఉంటున్న కూల్ డ్రింక్ షాపుల సైతం ఈయన గారికి కప్పం కట్టాల్సిందే. ఇలా సిండికేట్ దారులు, బెల్ట్ దుకాణం దారులు, కూల్ డ్రింక్ షాప్ ఓనర్లు నుంచి అందిన కాడికి దోచుకుంటూ అక్రమ సంపాదన పోగేసుకుంటున్నారు. విలేకరులు ఈ విషయంపై అనేకమార్లు ప్రశ్నించినప్పటికీ తాను వసూలు చేస్తున్న అక్రమ సంపాదన జిల్లాస్థాయి అధికారుల వరకు పంచుతున్నానని పత్రికల్లో వార్తలు వచ్చినంత మాత్రాన తమకు ఒరిగేది ఏమీ లేదని ఆయన విలేకరులపైనే కసుబుస్సులాడటం విశేషం. గతంలోనూ ఎన్నో వార్తలు వచ్చాయని, ఒక గౌడ సంఘం నేతను కొట్టినప్పటికీ తనపై ఉన్నతాధికారులు తనపై చర్యలకు సిఫార్సు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటే ఆ శాఖలో అతను కున్న పట్టు ఎలాంటిదో గుర్తు చేసుకోవాలని ఆయన విలేకరులకే దిమ్మతిరిగే సమాధానం చెబుతున్నారు. ఎలా వాకాడు ఎక్సైజ్ శాఖ సీఐ నిబంధనలకు వ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతూ, తాము చేసేదే ఉద్యోగం అని, తమ నిర్ణయమే శిరోధార్యమని, అక్రమ సంపాదనకు పాల్పడుతున్న తీరు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేలా ఉంది. ఈ విషయంపై వివరణ అడిగేందుకు స్వర్ణసాగరం అనేకమార్లు ఎక్సైజ్ శాఖ సిఐకు ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ మినిస్టర్ కొల్లు రవీంద్ర గ్రామీణ స్థాయిలో జరుగుతున్న మద్యం పాలసీ పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




రేపు 5వ భాగం..

# కాటమనేని భాస్కర్‌కు స్థానచలనమేనా

**విజయవాడ :** ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు స్థాన చలనం తప్పదని అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్లలో అమరావతికి ఓ రూపునివ్వాలని భావిస్తున్న కూటమి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సీఆర్డీఏ అధికారుల పనితీరు లేదని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ- సీఆర్డీఏ బాధ్యతల్ని కాటమనేని భాస్కర్‌కు అప్పగించారు. కొద్ది నెలలకే మంత్రి నారాయణతో పొసగక పోవడంతో ఆయన్ని బదిలీ చేశారు. మంత్రి నారాయణ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయక పోవడంతోనే కాటమనేని భాస్కర్‌ను సీఆర్డీఏ బాధ్యతల నుంచి తప్పించారనే ప్రచారం జరిగింది. కాటమనేని బదిలీ వ్యవహారంపై ముఖ్యమంత్రి స్థాయిలో అధికారులకు సర్ది చెప్పాల్సి వచ్చింది. కాటమనేని భాస్కర్ బదిలీ తర్వాత కన్నబాబుకు సీఆర్డీఏ కమిషనర్ పదవి దక్కింది. కమిషనర్ మారినా ఆ తర్వాత కూడా సీఆర్డీఏలో పాలనా వ్యవహారాల్లో ఎలాంటి మార్పు రాలేదనే అసంతృప్తి మంత్రి నారాయణలో ఉంది. ఈ క్రమంలో సీఆర్డీఏ సమీక్ష సమావేశాల్లో ముఖ్యమంత్రి అధికారులు, పురపాలక శాఖ మంత్రిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజధాని పనుల్లో వేగం లేకపోవడం, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు ముందుకు సాగక పోవడం సీఆర్డీఏ సమీక్షల్లో ప్రస్తావనకు వచ్చింది. రాజధాని పనుల విషయంలో అలసత్వాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారుల నుంచి తనకు సహకారం లభించడం లేదని మంత్రి నారాయణ వాపోతున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. సీఆర్డీఏలో పనులు మందకొడిగా సాగుతుండటంపై టీడీపీ స్ట్రాటజీ బృందం కొందరు అధికారుల్ని కీలక బాధ్యతల నుంచి తప్పించాలని సూచించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు అధికారులు గతంలో వైసీపీ నేతలతో అంటకాగారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నలుగురు అధికారుల్ని సీఆర్డీఏ నుంచి తప్పించాలని టీడీపీ స్ట్రాటజీ బృందం సిఫార్సు చేసినా కమిషనర్ వాటిని పట్టించుకోలేదని తెలుస్తోంది. మరోవైపు సీఆర్డీఏలో కీలకమైన పనులు ఏడీసీ ఆధ్వర్యంలో జరుగుతుంటే, భూసేకరణ పనులు సీఆర్డీఏ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఏడీసీకి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీ పార్థసారథి సారథ్యం వహిస్తున్నారు. ఏడీసీ ఏర్పాటైనప్పటి నుంచి ఆ స్థానంలో ఆమె ఉన్నారు. ఏడీసీకి రెగ్యులర్ ఐఏఎస్ అధికారి లేకపోవడంతో కింద స్థాయి సిబ్బంది ఆడింది ఆటగా సాగుతోంది. సీఎం సమక్షంలో జరిగే సమీక్షల్లో కింది స్థాయి అధికారులపై ఆధారపడాల్సి వస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఏడీసీ, సీఆర్డీఏలలో ఎవరు ఏ పనిచేస్తున్నారనేది కనీసం ఆ శాఖ మంత్రికి కూడా తెలియదని, సమీక్షలో చివాట్లు మాత్రం మంత్రికి దక్కుతున్నాయని చెబుతున్నారు. ఏడీసీ-సీఆర్డీఏల మధ్య సమన్వయం లేక పోవడంతో ఎవరి దారి వారిదే అన్నట్టు ప్రస్తుతం వ్యవహారం సాగుతోంది. ఏడీసీ, సీఆర్డీఏ ఉద్యోగ నియామకాల్లో ఏమి జరుగుతుందో కూడా ఎవరికి తెలియడం లేదు. సీఆర్డీఏలో పరిమిత సంఖ్యలో శాశ్వత ఉద్యోగులు ఉండటంతో ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన వారితో పాటు కాంట్రాక్టు ఉద్యోగుల్ని నియమించుకున్నారు. ఈ క్రమంలో ఎవరికి నచ్చిన వారిని వారు ఉద్యోగాల్లో పెట్టేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సీఆర్డీఏలో కీలక బాధ్యతలు నిర్వర్తించే అధికారి తన స్థానం మారినపుడల్లా తనతో పాటు ఆరుగురు సిబ్బందిని వెంట తీసుకు వెళ్లడం రివాజుగా మారింది. డ్రైవర్, అటెండర్, సీసీ వంటి వారిని ఎక్కడకు వెళితే అక్కడకు బదిలీ చేయించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. సాధారణంగా ఏ శాఖకు సంబంధించిన సిబ్బంది అదే శాఖలో కొనసాగాల్సి ఉన్నా సదరు అధికారి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు ఏపీ ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఈ క్రమంలో 2014-16 మధ్య కాలంలో సమీకరించిన 34వేల ఎకరాలకు సంబంధించి రైతుల వాటా ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. రైతులకు ఇచ్చిన ఫ్లాట్లలో మౌలిక సదుపాయాల లేకపోవడంపై వారి నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో రెండో దశ సమీకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రైతుల ఫిర్యాదులను పరిసీఆర్డీఏలో జరుగుతున్న పరిణామాలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి దాని బాధ్యతల్ని సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత కమిషనర్ కన్నబాబును రాజ్‌భవన్‌లో గవర్నర్ కార్యదర్శిగా నియమించనున్నట్టు వార్తలు వెలువడ్డాయి. ప్రస్తుతం గవర్నర్ కార్యదర్శిగా ఉన్న హరిజవహర్‌లాల్ జూన్ 30న పదవీ విరమణ చేయనుండటంతో ఆ పోస్టులోకి కన్నబాబును పంపే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఆయన స్థానంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి కృష్ణబాబుకు సీఆర్డీఏ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది



కాటమనేని భాస్కర్ (పాత చిత్రం)

# హై లెవల్ సరే...కేడర్ సంగతేంటీ

కాకినాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ మధ్య తరచూ ఒక వ్యాఖ్య చేస్తున్నారు. కూటమిని ఎవరూ విడదీయలేరంటున్నారు. తమ మిత్రత్వాన్ని చెడగొట్టే పనిచేయలేరని అంటున్నారు. కరెక్టే.. టీడీపీ, జనసేన, బీజేపీ 2029 ఎన్నికల్లో కూడా కలసి పనిచేస్తాయి. అందులో ఎవరికీ పెద్దగా సందేహం లేదు. ఎందుకంటే 2024 లో జరిగిన ఎన్నికల్లోనే వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయంటే వచ్చే ఎన్నికల్లో విడిపోతే పడిపోక తప్పదని ముగ్గురికీ తెలుసు. చంద్రబాబు నాయుడు కానీ, నరేంద్ర మోదీ కావచ్చు.. పవన్ కల్యాణ్ అనుకోవచ్చు. తాము ముగ్గురం కలసి ఉంటే విజయం మరొసారి ఖాయమన్న విశ్వాసం ముగ్గురిలోనూ కనపడుతుంది. అందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు ఇద్దరూ మరొకసారి కలిసే పోటీ చేస్తామని చెబుతుండం, జగన్ అధికారంలోకి రానివ్వబోమని చెబుతుండటాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే ఇది వింటానికి చాలా బాగుంటుంది. పవన్ కల్యాణ్ చెప్పినట్లుగానే సినిమాల్లో ఆ డైలాగులు బాగుంటాయి. బయట అంటే తొక్కి నారతీస్తాం అని హెచ్చరించారు. అలాగే స్టేజీ పై మాట్లాడిన మాటలు బాగానే ఉంటాయి. విజయం తమదేనని, కూటమి విడిపోదని చెప్పుకోవచ్చు. కానీ వేదిక కింద పరిస్థితి ఏంటన్నది పవన్ కల్యాణ్ కు అర్థమవుతుందా? అని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. తన సొంత పార్టీ నేతలపైనే అనుమానంతో పవన్ కల్యాణ్ ఒక కన్నువేసి ఉంచడమే కాకుండా సర్వేలు కూడా చేయించుకోవడం చూస్తుంటే ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఎంత మాత్రం ఉందో తెలుసుకునే ప్రయత్నం అయినా ఉండాలి. లేకుంటే వారి గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలన్న తపన కావచ్చు మోదీ.. పవన్... చంద్రబాబు ఈ ముగ్గురు కలసి నడుస్తారు. పోటీ చేస్తారు కూడా. అందులో వివాదమే లేదు. కానీ కిందిస్థాయి క్యాడర్ కదా కలసి నడవాల్సింది. సామాజికవర్గాలు కదా కలసి పనిచేయాల్సింది. ద్వితీయ శ్రేణి నేతలు కదా కట్టడిగా ఉండాల్సింది. కానీ ప్రస్తుతం ఏడాదిలోనే కూటమి పార్టీల్లో మూడింటిలో క్యాడర్ సంతృప్తిగా లేదు. కొద్దో గొప్పో కొంత శాతం ఎక్కువగా క్యాడర్ సంతోషంగా ఉంది తెలుగుదేశం పార్టీలోనే. ఎందుకంటే పనులు జరుగుతున్నవి వారికే. కాంట్రాక్టులు దక్కుతున్నవి వారికే. చిన్నచిన్న పనులతో పాటు నామినేటెడ్ పోస్టులు కూడా అత్యధికంగా చేజిక్కించుకుంటున్నది తెలుగు తమ్ముళ్లే. అందుకే తెలుగుదేశం పార్టీలో యాభై శాతం క్యాడర్ సంతృప్తి కరంగానే ఉంది. ఇక జనసేన విషయానికి వస్తే తాము గెలిచిన 21 నియోజకవర్గాల్లో. గెలిపించిన 154 నియోజకవర్గాల్లో సంతృప్తికరంగా లేరు. అసలు నిజం చెప్పాలంటే జనసేనఎమ్మెల్యలు ఉన్న చోట వారికంటే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకే పనులు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అని లేదు. దాదాపు 175 నియోజకవర్గాల్లో మూడు పార్టీల క్యాడర్ మధ్య సఖ్యత లేదు. కలుపుకుని పోవాలని ప్రయత్నించే నేత లేరు. అలాగే ద్వితీయ శ్రేణి నేతల్లోనూ కలసి ఉందామన్నధ్యాస లేదు. ఒకరిపై ఒకరు కసి, పగ పెంచుకునే స్థాయికి వచ్చారు. ఏడాదిలోనే ఇలా ఉంటే ఇక మీ ముగ్గురు పైన కలసి లాభమేముందయ్యా అని సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి జనసేనాని పైన.



## ఆగస్ట్ 15వ తేదీ నుంచే మహిళలకు ఉచిత బస్సు

-మొదటిపేజీ తరువాయి

ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ, ఏసీ బస్సులే ఉండాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం

అలాగే.. మున్సిపల్, పురపాలక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉండవల్లి నివాసంలో సమీక్షకు మంత్రి నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అమృత్ స్కీమ్ కింద తాగునీరు పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచామని సీఎం చంద్రబాబు తెలిపారు. వారంలో రూ.5,350 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలుస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. గుంటూరు, విశాఖపట్నంలో చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల్లూరు, రాజమండ్రి ప్లాంట్లకు టెండర్లు పూర్తి అయ్యాయని చెప్పారు. కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్లాంట్లకు త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో ఆధునిక యంత్రాల కొనుగోలుకు రూ.225 కోట్లు కేటాయించామని తెలిపారు. వీలైనంత త్వరగా లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గింది

**విజయవాడ:** ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో 'సురక్షా 360' కార్యక్రమాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గిందని హోంమంత్రి అన్నారు. సాంకేతికత వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందంజలో ఉందని ప్రశంసించారు. మోడల్ పోలీసు స్టేషన్లు జిల్లా మొత్తం విస్తరించాలని.. సురక్ష యాప్, సురక్ష డివైస్‌ల వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతుందన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు బాగా పెరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని ఆలయం, చర్చి, మసీదులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా 28 సురక్ష డివైస్ కిట్‌లను అధికారులకు మంత్రి అందజేశారు. ప్రతి గ్రామం, ప్రతి వీధి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలనేది సురక్షా 360 లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు తెలిపారు. విజయవాడలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బోండా ఉమా తదితరులు పాల్గొన్నారు.

## స్వార్థ రాజకీయాల్లో జగన్ నెంబర్ వన్




-మొదటిపేజీ తరువాయి

బీజేపీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్ పూర్తిగా స్వార్థ రాజకీయాల కోసం అదే బీజేపీతో అక్రమ పొత్తులు పెట్టుకుని, ఎక్కడపడితే అక్కడ మద్దతు, ఏ బిల్లుకైనా మద్దతు ఇచ్చారని, అదానీ, అంబానీలకు ఎంతో దోచి పెట్టారని ధ్వజమెత్తారు. బీజేపీతో కొట్లాడే చిత్తశుద్ధి వైసీపీకి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రానున్న నాలుగేళ్లలో బలోపేతమవుతుందని, పిల్లకాలువలన్నీ కాంగ్రెస్ పార్టీలో కలవాల్సిందేనని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి, మోదీని, బీజేపీని ఎదిరించే సత్తా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెసని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం మన రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. మోదీ హయాంలో దేశంలో గత పదకొండేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్, వైసీపీ పార్టీలకు కూడా మోదీకి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం లేదన్నారు. చివరకు మీడియాకు కూడా దమ్ము లేకుండా చేశారన్నారు. పలు పర్యాయాలు మోదీ కేడీ అంటూ వ్యాఖ్యానించారు. గోద్రా రైలు సంఘటన నుంచే మోదీ అంటే ఏమిటో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. రాహుల్‌గాంధీ క్రేజ్ అంతకంతకు పెరుగుతుండడంతో బీజేపీ ప్రభుత్వం తట్టుకోలేక ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని తెరపైకి తీసుకువచ్చిందన్నారు. అంతకంటే దారుణమైన పరిస్థితులు గత 11 ఏళ్లుగా దేశంలో ఉన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఏపీకి న్యాయం చేయగల శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు తగ్గించినా ఒక్క ఎంపీ కూడా నోరు మెదపకపోవడం దారుణమన్నారు. నాటి సీఎంలు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి హయాంలో తన ఫోన్‌ను సైతం టాపింగ్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వాస్తవాలను బయట పెడుతున్న మీడియాపై బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

## యనమలకు రిటైర్మెంట్...

**కాకినాడ :** తెలుగుదేశం పార్టీకి ఒక ప్రత్యేక వ్యూహం అంటూ ఒకటి ఉంటుంది. ఆ పార్టీ విధానాలను అనుసరించి అనుకూల మీడియాలో కథనాలు ప్రచురితం అవుతాయి. ఆ సెక్షన్ ఆఫ్ మీడియాలో ప్రాధాన్యత అంశాలు మారుతుంటాయి. ప్రస్తుతం టిడిపి అనుకూల మీడియాలో లోకేష్ బృందానికి ఎక్కువగా ప్రాధాన్యత దక్కుతోంది. వారితో పోల్చుకుంటే సీనియర్లకు ఏమంత ప్రాధాన్యత లేకుండా పోతోంది. ఇటీవల పార్టీలో సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఎందుకనో ఆయన విషయంలో టిడిపి అనుకూల మీడియాలో పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు. దీంతో రకరకాల చర్చ నడుస్తోంది. తెలుగుదేశం పార్టీలో యనమల రామకృష్ణుడి శకం ముగిసినట్లేనని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో ఆయన కుటుంబానికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు చంద్రబాబు. కూతురుకు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చారు. అల్లుడికి పార్లమెంట్ స్థానాన్ని ఇచ్చారు. ఆ ఇద్దరూ గెలిచారు. అయితే ఎమ్మెల్సీగా పదవీ విరమణ చేసిన యనమల రామకృష్ణుడు కు మాత్రం ఎటువంటి చాన్స్ లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీకి అధికారంతో సంబంధం లేకుండా యనమల రామకృష్ణుడుక ఎనలేని ప్రాధాన్యమిస్తూ పదవులు ఇచ్చారు చంద్రబాబు. చివరకు 2014లో ఆయన ఎమ్మెల్సీగా ఉంటే ఆర్థిక శాఖ మంత్రిగా తన క్యాబినెట్లో చోటిచ్చారు. 2019లో పార్టీ ఓటమి చవిచూసినా.. యనమల రామకృష్ణుడు కు ఎమ్మెల్సీగా ప్రమోట్ చేశారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన తప్పకుండా మంత్రి అయ్యారు. అది కూడా కీలక పోర్టు పోలియోను దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు యనమల రామకృష్ణుడు భవిష్యత్తుపై రకరకాల చర్చ నడుస్తోంది. ఇటీవల ఆయన భారీ స్టేట్మెంట్లు ఇచ్చారు. తన జీవితంలో చివరి కోరిక మిగిలిపోయిందని.. పెద్దల సభ ద్వారా పార్లమెంట్లో అడుగు పెట్టాలని ఉందని తన మనసులో ఉన్న మాటను బయటపెట్టారు. అయితే యనమల రామకృష్ణుడు కు తప్పకుండా రాజ్యసభ పదవి కానీ.. గవర్నర్( పోస్ట్ కానీ దక్కుతుందని అంతా భావించారు. విస్తృత స్థాయిలో చర్చ కూడా సాగింది. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. ఇటీవల మహానాడులో యనమల రామకృష్ణుడు కు ప్రాధాన్యత దక్కింది. కానీ ఆయన సూచనలను పరిగణలోకి తీసుకోకపోవడంతో ఆయన అసంతృప్తికి లోనైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లోకేష్ టీం ఎంట్రీ తర్వాత యనమల రామకృష్ణుడికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో సానా సతీష్ అనే యువనేత యాక్టివ్ అయిన తర్వాత.. డిప్యూటీ సీఎం గా పవన్ బాధ్యతలు తీసుకున్నాక యనమల రామకృష్ణుడిని సైడ్ చేశారన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు టిడిపి అనుకూల మీడియా కూడా యనమలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం పై.. ఆయన అనుచరుల్లోనే ఒక రకమైన బాధ వినిపిస్తోంది. ఇక మా సార్ కు రాజకీయ వీడ్కోలు తప్పదా అన్నట్టు వారు చర్చించుకోవడం కనిపిస్తోంది.

# ఇష్టానుసారంగా ఇటుక బట్టి వ్యాపారస్తుల పనితీరు

**ఇటుక బట్టి కోసం రోడ్డుపై అడ్డం గా తోలిన చెట్ల మొక్కలు**
**రోడ్డుకి కనీసం అడుగు దూరం కూడా లేని ఇటుక బట్టీలు**
**పచ్చని చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్న పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు**






కోట స్వర్ణసాగరం జూన్ 28

కోట మండల పరిధిలో ఇటుక బట్టిన వ్యాపారస్తులు ది వ్యాపారస్తుల పనితీరు వారి ఇష్టారాజ్యంగా మారింది.కొంతమంది ఇటుక బట్టి వ్యాపారస్తులు ఎటువంటి అనుమతులు,షరతులు, లేకుండా వారి ఇష్టానుసారంగా ఇటుక రాయి వ్యాపారాలు చేస్తూ లక్షల రూపాయలు గడుస్తున్నారు.ఈ నేపథ్యంలోనే కోటలోని కోటమ్మ గుడి నుండి తిమ్మనాయుడుపాలెం వెళ్లే రోడ్డుకి అడుగు దూరం కూడా లేని ఇటుక బట్టీకి ఓ ఇటుక వ్యాపారి పచ్చని చెట్లను నరికి రోడ్డుకు అడ్డంగా మొక్కలు తోలటం వలన వాహనదారులకు ఇబ్బందిగా మారింది.సంబంధిత అధికారులు ఇటుక బట్టీల అనుమతులుపై ఆరా తీసి తగు చర్యలు తీసుకోవాలని కోటం మండల ప్రజలు కోరుతున్నారు.ఈ ఇటుక బట్టీలను కాల్చేందుకు కట్టె మాఫియా పచ్చని చెట్లను,అదేవిధంగా చల్లకాలువ ఒడ్డున ఉన్న కట్టెలను ఇటువంటి అనుమతులు లేకుండా నరికి ఇటుక బట్టి దారులకు విక్రయిస్తున్నారు. వీటిపై ఫారెస్ట్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోట మండల ప్రజలు కోరుతున్నారు.

# పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి జన్మదిన సందర్భంగా విరాళం



### ఒక్కరోజు నిత్య అన్నదానమునకు విరాళం 1,11,111

కాణిపాకం జూన్ 28 స్వర్ణ సాగరం

పలమనేరు ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నదానంకు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం 1 రోజు నిత్య అన్నదానమునకు విరాళం – 1,11,111 రూపాయలు, పలమనేరు శాసనసభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు అమర్నాథ్ రెడ్డి జూలై 2 వ తేదీ జన్మదినం సందర్భంగా యువరాజు నాయుడు , పూతలపట్టు వారు ఈ విరాళాన్ని దేవస్థానం కార్యనిర్వహణధికారి పెంచల కిషోర్ కి అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ వాసు, తదితరులు ఉన్నారు.

# వసతి సముదాయం వినాయక సదన్ నందు విస్తృత తనిఖీలు

### పలు సూచనలు తెలియజేస్తున్న ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం జూన్ 28 స్వర్ణ సాగరం

వసతి సముదాయం వినాయక సదం నందు విస్తృత తనిఖీలు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వసతి సముదాయం వినాయక సదన్ నందు విస్తృత తనిఖీలు నిర్వహించిన దేవస్థాన ఈ.ఓ పెంచల కిషోర్ , వసతి సముదాయం పరిశుభ్రత మరియు మంచాలు, బెడ్లు, బెసిట్లు, పరిశుభ్రంగా భక్తులకు సౌకర్యాలను కలుగజేయాలని సిబ్బందికి సూచించారు, ఈ కార్యక్రమంలో ఈ.ఈ వెంకటనారాయణ, ఏఈఓ లు కృష్ణారెడ్డి, ధనంజయ, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై నారా లోకేష్‌తో చర్చించిన పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్



ఐరాల జూన్ 28 స్వర్ణ సాగరం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రివర్యులు నారా లోకేష్ని విజయవాడలో పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. మురళీమోహన్ పూతలపట్టు నియోజకవర్గంలో చేపట్టాల్సిన ప్రాధాన్య పనులు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారి, తాగునీటి సమస్యలు, విద్యా, వైద్యం రంగాల్లో ఎదురవుతున్న సమస్యలు వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నారా లోకేష్ ప్రజల అవసరాలను గమనిస్తూ సమర్థవంతమైన అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

# ఐవిఆర్ఎస్ పాతపాలెం పంచాయతీని సందర్శించిన ఎంపీడీవో ధనలక్ష్మి, సర్పంచి లోకేష్

ఐరాల జూన్ 28 స్వర్ణ సాగరం



ఐ వి ఆర్ ఎస్ పంచాయతీని సందర్శించిన ఐరాల ఎంపీడీవో ధనలక్ష్మి, సర్పంచి లోకేష్ రాయల్, శనివారం ఐరాల మండలం పాతపాళ్యం పంచాయతీ ని ఉదయం చెత్త సేకరణ పై పాతపాలెం గ్రామంలో సందర్శించి ప్రజల నుండి చెత్త సేకరణలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు, ఎంపీడీవో ధనలక్ష్మి మాట్లాడుతూ ఉదయం చెత్త సేకరించాలని పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పాతపాళ్యం పంచాయతీ సర్పంచ్ లోకేష్ రాయల్, ఐరాల మండలం తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జై చంద్రయ్య, పాతపాలెం పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బి. వేణుగోపాల్, లోకయ్య, సుబ్రమణ్యం, చందు, నరేష్, పంచాయతీలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నమాచార్య సంకీర్తనలతో ప్రతిధ్వనించిన శ్రీసిటీ






శ్రీసిటీ,స్వర్ణ సాగరం జూన్ 28, 2025:

శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో నిర్వహించిన 'అన్నమయ్య పదామృతవర్షిణి' కార్యక్రమం సంగీత ప్రియులకు వీనుల విందు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా అన్నమయ్య కీర్తనలు, రచనల గొప్పతనాన్ని వివరిస్తూ కార్యక్రమాన్ని రక్తి కట్టించగా, ఆయనకు తోడుగా నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష కొన్ని అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించి దీనిని మరింత రంజింప చేసింది. శంకరరావు తన ప్రసంగంలో లోతైన విశ్లేషణతో అన్నమయ్య ప్రాశస్త్యాన్ని వివరించారు. పలువురు ప్రముఖ కవులు తమ ప్రబంధ సాహిత్యాన్ని రాజులను మెప్పించేందుకు వాడితే, వేదాలలో వున్న సారాన్ని అచ్చ తెలుగులో సంగీతంగా మలచి వేంకటేశ్వరస్వామికి సమర్పించడంతో పాటు ఆయనను ఊరూర తిప్పిన సామాజిక స్పృహ కలిగిన ప్రజా కవి అన్నమయ్య అని ఆయన అభివర్ణించారు. శంకరరావు




ప్రసంగం అనంతరం, 'ఆమె బ్రహ్మం ఒక్కటే', 'చక్కని తల్లికి', 'అదిగో అల్లడిగో', 'చిన్ని సిసువు' ఇతర పలు అన్నమయ్య సంకీర్తనలను గాయకురాలు మల్లాది అనూష వాయిద్య కళాకారులతో కలిసి శ్రావ్యంగా ఆలపించారు. ప్రతి సంకీర్తనకు ముందు శంకరరావు ఆ కీర్తనకు సంబంధించిన సారాంశాన్ని, గొప్పదనాన్ని వివరిస్తూ గానామృతాన్ని కొనసాగించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తన సందేశంలో వ్యాఖ్యానించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, అన్నమాచార్య రచనలు కేవలం భక్తి గీతాలు మాత్రమే కాదు, అవి ప్రజలను జాగృతం చేసే తత్వ బోధనలు అన్నారు. ఇటువంటి వారసత్వ సంపదను కొత్త తరాలకు వివరించే ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి శ్రీసిటీ–శ్రీవాణి వేదిక కావడం తమకు గర్వకారణం అన్నారు. కళాకారులు శంకరరావు, కుమారి అనూష, ఇతర బృంద సభ్యులను ఆయన అభినందించారు. నిర్వాహకులు తరపున తిరుపతి శ్వేతా మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్ కె యూనివర్సిటీ మాజీ ఉప కులపతి శ్రీమతి కుసుమ కుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించగా, శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సూళ్లూరుపేట, శ్రీహరికోట మరియు శ్రీసిటీ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ఇందులో పాల్గొన్నారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# సిమెంట్ రోడ్డు పనులను నాణ్యతగా చేయండి..



### పి ఆర్ డి ఈ. వి. వి రవీందర్ రెడ్డి

శ్రీ రంగరాజపురం స్వర్ణ సాగరం జూన్ 28

గ్రామాల్లో నిర్మిస్తున్న సిసి రోడ్లను నాణ్యతంగా చేపట్టాలని పంచాయతీరాజ్ డిఈ వివి రవీంద్రారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని 50 బసిరెడ్డిపల్లి న్యూ కాలనీకి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ :26 లక్షలు నిధులు మంజూరు అయింది. ఈ పనులను డి ఈ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్, మాజీ ఎంపీటీసీ తిరుమల పాల్గొన్నారు.

# "సీఎం సహాయ నిధి చెక్కు అందజేత. "



### "పేదలకు భరోసాగా సీఎం సహాయనిధి : పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్.."

స్వర్ణసాగరం తవణంపల్లె జూన్-28

పూతలపట్టు నియోజకవర్గం,తవణంపల్లె మండలం, కాణిపాకం పట్నం గ్రామానికి చెందిన ప్రేమలతకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ అందజేశారు. శనివారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే మురళీమోహన్ కార్యాలయంలో కాణిపాక పట్నం గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు ప్రేమలతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 50,000 చెక్కును ఎమ్మెల్యే మురళీమోహన్ అందజేశారు. సీఎం సహాయ నిధి చెక్కు అందుకున్న ప్రేమలత సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద ఆర్థిక సహాయం అందజేసి భరోసాగా నిలుస్తుందన్నారు. వైద్యపరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద నిధులు మంజూరు చేసి అందించడం జరుగుతుందని, ప్రేమలత ఆరోగ్య సంబంధిత సమస్యలతో బాధ పడుతుండగా, సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా, వేంటనే సంబంధిత అధికారులు పంపి సీఎం సహాయనిధి మంజూరు చేయడం జరిగిందన్నారు.

# పల్సర్ బైక్ ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

### ప్రమాద స్థితిలో అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన సోదరుడు

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 28



మండలం లోని వెంకన పాలెం గ్రామం దళితవాడమండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలోఎదురుగా వస్తున్న పల్సర్ బైక్ ఢీకొని ఊటుకూరు నాగార్జునకు తీవ్ర గాయాలై ప్రమాద స్థితిలో నెల్లూరు అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై నాగార్జున సోదరుడు విజయ్ కుమార్ తోటపల్లి గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించిన పూర్వాపరాలివిమహాలక్ష్మి పురానికి చెందిన ఊటుకూరు నాగార్జున తన సొంత పనిమీద వెంకన పాలెం పోయి తిరిగి వచ్చే సమయంలో వెంకన్నపాలెం గ్రామానికి చెందిన షేక్ షబీనా పల్సర్ మోటార్ బైక్ పై ఫోన్లో మాట్లాడుతూ నాగార్జున బైకును ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు మెరుగైన వైద్యం కోసం అపోలో ఆసుపత్రిలో చేర్పించినట్లు ఫిర్యాదుదారుడు విజయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ విషయంలో వాస్తవ విచారణ జరిపి న్యాయం చేయాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు

స్వర్ణసాగరం



# టెన్త్ క్లాసులో మండల ఫస్ట్ సాధించిన విజ్ఞాన జోషికను అభినందించిన ప్రముఖ పారిశ్రామికవేత్త నాయుడు ఆదికేశవుల రెడ్డి



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 28**

మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో మండల స్థాయిలో 585 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన చేబ్రోలు విజ్ఞాన జోషికకు ప్రముఖ పారిశ్రామికవేత్త విద్యాదాత దైవభక్తి పరాయణుడు నాయుడు ఆదికేశవుల రెడ్డి సన్మానించారు. ఉత్తమ మార్కుల సాధించి మండల స్థాయిలో గుర్తింపు తెచ్చిన బాలికను అభినందించి ఆశీర్వదించారు. బాలికకు నగదు రూ 25000 పాఠశాల యాజమాన్యం రూ 30000 మొత్తం 55000 బాలికకు అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాగా విద్య అభ్యసించి ఉన్నత స్థితికి ఎదగాలని తోటపల్లి గూడూరుకు జిల్లా పరిషత్ పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పదో తరగతిలో తమ పాఠశాల నుంచి 68 మంది హాజరు కాగా అందులో 66 మంది ఉత్తీర్ణత సాధించి 98 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు తమ పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నారని వారి అవసరాల కోసం కూర్చునేందుకు ఐరన్ టేబుల్ డస్కులు కేటాయించాలని కోరడంతో అందుకు ఆదికేశవరెడ్డి సమ్మతించారు. ఆది కేశవరెడ్డి తమ పాఠశాలకు అనేక వసతులు సమకూర్చినట్లు హెచ్ఎం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# ఘనంగా గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ పుట్టిన రోజు వేడుకలు



**వి.ఎం.థామస్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్**

**ఐరాల జూన్ 28 స్వర్ణసాగరం**

ఐరాల,ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం.థామస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం గంగాధరనెల్లూరు మండలం, రామానాయుడు పల్లె గ్రామంలో నిర్వహించిన డాక్టర్ వి.ఎం.థామస్ పుట్టిన రోజు వేడుకల్లో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మరియు చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ వి.ఎం.థామస్ ప్రజల కోసం నిరంతరం శ్రమించే నేత. ఆయన సేవా దృక్పథం, నాయకత్వ నైపుణ్యాలు ప్రశంసనీయమైనవని, ఆయనకు దీర్ఘాయుష్షు కలగాలని, మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

# జంగాల కండ్రిగ గిరిజనుల సమస్య పరిష్కారం



**జనసేన నేత కృషి ఫలితం**

**ముత్తుకూరు స్వర్ణ సాగరం జూన్ 28**

సర్వేపల్లిజనసేన పార్టీ సమన్వయ నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడు కృషితో

గత 20 సంవత్సరాలుగా జంగాల కండ్రిగ కాలవ అంచున నివసిస్తున్న గిరిజనులు కనీసం వీధి లైట్ కూడా లేక అంధకారంలో విష పాముల మధ్య నివాసం ఉంటున్నారు.గత ప్రభుత్వం ఏనాడు కూడా వైసిపి పాలకులు వచ్చి ఆనాడు వారికి రేషన్ కార్డులు గాని ఆధార్ కార్డులు గాని కరెంటు గాని ఇప్పిచ్చినటువంటి పరిస్థితి లేదు.

లినేడు కూటమిలో భాగంగా ఆ విషయం తన వెంటనే వాళ్లకి కొత్త ఆధార్ కార్డులు వ్రాయించడం జరిగింది దాంతోపాటు సింగిల్ ట్రాన్స్ఫార్మరర్ నిన్నటి రోజు బిగించడం వారికి కొంతమందికి మీటర్ల కి డబ్బులు కూడా కట్టించడం జరిగింది మిగిలిన వారికి కూడా తాము కట్టిస్తామని చెప్పడం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేస్తాం అనడంతో ఎంతో ఆనందంగా గిరిజనులు చీకట్లో నుంచి మా జీవితాలను వెలుగులోకి నింపినందుకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది కూటమి ప్రభుత్వం అంటే ఇలాగే ఉంటుంది ఇలాగే పేద బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తుంది.ఈ కార్యక్రమంలో మోత్కూరు మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, సందూరి శ్రీహరి, సుమన్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

# తల్లి జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ

**కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్**

**స్వర్ణ సాగరం డోర్నకల్ జున్ 28**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం శ్రీనివాస్,తమ తల్లి శీలం లలితమ్మ జ్ఞాపకార్థం శనివారం మండలం ప్రాథమిక బాలికల పాఠశాలలో వందమంది విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులను అందజేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శీలం లలితమ్మ, మూడో వర్ధంతి సందర్భంగా కుమారుడు శీలం శ్రీనివాస్, మంచి ఆలోచనతో తల్లి జ్ఞాపకార్థం విద్యార్థులకు గ్లాసులు ప్లేట్లను అందచేయడన్ని వారు అభినందించారు.ఇలాగే మరి కొంతమంది దాతలు ముందుకోచ్చి ప్రభుత్వ పాఠశాలకు సహయ సహకారాలు అందిం చాలని కోరారు.కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కాలా సుమేర్ జైన ˜,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కేశబోయిన కోటి లింగం, నాయకులు మాధ శ్రీనివాస్, తాళ్లూరి హనుమా,మామిడి నాగరాజు, సౌడం మహేష్,ఎస్ వెంకటేశ్వర్లు తారాచంద్, రామారావు,ఫరిద్, కృష్ణ మూర్తి, మున్నా, పవన్,వెంకన్న, పాఠశాల హెచ్ఎం లు జాష్మాని, నరసింహారావు, ఉన్నారు



# విద్యార్థులకి బ్యాగులు పంపిణీ చేసిన:వెంకటగిరి మండల సర్పంచ్ అధ్యక్షులు తుమ్మూరు మస్తాన్ రెడ్డి

**వెంకటగిరి జూన్ 28 స్వర్ణసాగరం**

వెంకటగిరి రూరల్ మండలం అమ్మపాలెం గ్రామం నందు వెంకటగిరి మండల సర్పంచ్ అధ్యక్షులు తుమ్మూరు మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు ఇంటర్మీడియట్ విద్యార్థులకు టెన్త్ క్లాస్ విద్యార్థులకు బ్యాగ్స్ ప్యాడ్స్ పంపిణీ చేశారు.జడ్పీహెచ్ఎస్ స్కూల్ చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వెంకటగిరి మండల సర్పంచ్ అధ్యక్షులు తుమ్మూరు మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సమయాన్ని వృథా చేయరాదని తెలియజేశారు దేశంలోని మహాను భావులందరూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివినవారేనని తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్నారు .ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అన్ని మౌలిక వసతులు ఉంటాయన్నారు.విద్యా కోసం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమణారెడ్డి మరియు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# పెంచలకోన క్షేత్రం నందు అభిషేక కార్యక్రమాలు



**వెంకటగిరి జూన్ 28- స్వర్ణ సాగరం**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, పెంచలకోన క్షేత్రం నందు శనివారం సందర్భంగా ఉదయం గం.4.00 శ్రీ స్వామి వారికి అభిషేకం,గం.10.30. కి శ్రీ వార్లకు కళ్యాణోత్సవం,మరియు సాయంత్రం గం.5.30. లకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి వారి కి తిరుచ్చి పల్లకి సేవ ప్రధానార్చకులు,వేదపండితుల మంత్రోచ్ఛరణలతో మంగళ వాయిద్య, గిరిజనుల వాయిద్య నడుమ సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించడమైనది ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించినారు.భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా క్యూలైన్ల ఏర్పాట్లు, మంచి నీరు సరఫరా,అన్నదానం మొదలగు కార్యక్రమాలు ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి గారి ప్రత్యక్ష పర్యవేక్షనలో నిర్వహించడం జరిగినది.

# డోర్నకల్ నూతన మున్సిపల్ కమిషనర్ కి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



**స్వర్ణ సాగరం డోర్నకల్ జున్ 28**

డోర్నకల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన బి.నిరంజన్,ను డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కాలా సుమేర్ జైన్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కేశబోయిన కోటి లింగం, నాయకులు మాధ శ్రీనివాస్,తాళ్లూరి హనుమా, మామిడి నాగరాజు, సౌడం మహేష్,ఎస్ వెంకటేశ్వర్లు తారాచంద్,రామారావు,ఫరిద్, కృష్ణ మూర్తి, మున్నా, పవన్,వెంకన్న, తదితరులు ఉన్నారు

# డోర్నకల్ నూతన మున్సిపల్ కమిషనర్ కి శుభాకాంక్షలు తెలిపిన అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు



**స్వర్ణ సాగరం డోర్నకల్ జున్ 28**

డోర్నకల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బి.నిరంజన్, బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డోర్నకల్ అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి నాయిని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఏపూరి రమణయ్య, పేరాల నరసయ్య,మేకల రామారావు,తదితరులు ఉన్నారు

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మహిళ మృతి ఐదుగురికి గాయాలు

**పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్ 28.**








71వ నంబర్ జాతీయ రహదారి మార్గంలో ఎగుచావలి, తాళ్వాయిపాడు గ్రామాల వద్ద శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సరస్వతి(50) అనే మహిళ మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలైనాయి. పోలీసుల సమాచారం మేరకు వివరాలు. విజయనగరం ప్రాంతానికి చెందిన లహరి తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి కారులో బయలుదేరి వెళుతున్నారు. మార్గం మధ్యలో ఎగువచావలి గ్రామం వద్ద ముందు వెళుతున్న గుర్తుతెలియని లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వెళుతున్న కారు ముందు లారీని వేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో వెళుతున్న సరస్వతి, లహరి, మీన, నవ్యాలకు తీవ్ర గాయాలైనాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ కానిస్టేబుల్ మైకేల్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 1033అంబులెన్స్ లో శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ సరస్వతి మృతి చెందింది అదేవిధంగా నెల్లూరు నుండి బెంగళూరు వెళుతున్న కారు మార్గం మధ్యలో తాల్వాయిపాడు గ్రామం వద్ద ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తు ఢీకొన్నది.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న దువ్వూరు శ్రావణ్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి లకు గాయాలైనాయి. స్థానికులు చికిత్సలు నిమిత్తం క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 28**

మండలం లోని నరకూరు సెంటర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు ఆఫీసు నందు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాశిన పరశురామయ్య, ఏ గోపి మరియు ట్రెజరర్ శివ లు పాల్గొని మాట్లాడుతూ....

బుచ్చిరెడ్డిపాలెం టౌన్ లో జూలై 1 న ఆటో జిల్లా మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలకు నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాల మరియు సిటీ,రూరల్ ఆటో స్టాండ్ల నాయకత్వం పాల్గొని మహాసభలు జయప్రదం చేయాలని ఉదయం 9 గంటలకు బుచ్చి రెడ్డి పాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి ఆటో ర్యాలీ ప్రారంభమై బుచ్చి టౌన్ లో ఈ ర్యాలీ కొనసాగి అంబేద్కర్ భవనం వరకు చేరుకుంటుందని అనంతరం మహాసభ ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మోర్ల సుప్రజ (ఛైర్ పర్సన్ బుచ్చిరెడ్డిపాలెం సంగం పంచాయతీ ) ఎం శ్రీనివాసులు రెడ్డి (సర్కిల్ ఇన్స్పెక్టర్ బుచ్చిరెడ్డిపాలెం) కామ్రేడ్ ముజ్ ఫర్ అహ్మద్ (ఏపీ ఆటో అండ్ ట్రాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) కామ్రేడ్ కే అజయ్ కుమార్ (సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి) కామ్రేడ్ వి వి ప్రసాద్ (సిఐటియూ జిల్లా అధ్యక్షులు) కామ్రేడ్ కే సురేష్ ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కామ్రేడ్ ఎం.వి రాజా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పాల్గొంటారని పై మహాసభకు ఆటో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయవలసిందిగా కోరారు అనంతరం వారు మాట్లాడుతూ......




రవాణారంగ రక్షణ కోసం, డ్రైవర్స్ సంక్షేమ బోర్డు సాధన కోసం జూలై 9 దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వాహన డ్రైవర్స్ టైర్ బంద్ పాటించాలి.లి దేశవ్యాప్తంగా 2019 మోటార్ వెహికల్ ఏమెండ్మెంట్ యాక్ట్ ప్రకారం ప్రమాదాలు జరిగితే డ్రైవర్స్ కారణం అంటు నూతన న్యాయచట్టాలు ప్రకారం జైలుశిక్షలు, లక్షలాది రూపాయలు పెనాల్టీలు వేస్తున్నారు, రోజువారి పెద్ద ఎత్తున నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబాలు గడవడం ఇబ్బందికరంగా మారుతుంది,దీనికి తోడు వాహనాల మీద వివిధ రకాల టాక్స్ లు పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు,ఇతర దేశాల కంపెనీలు ర్యాపిడో, ఓల్వో లాంటి ఆన్లైన్ రవాణా వల్ల అనేకమంది డ్రైవర్లు రోడ్డున పడుతున్నారని వాటిని ఆంధ్ర రాష్ట్రంలో అనుమతించరాదని డిమాండ్ చేశారు,ఆంధ్రరాష్ట్రంలో 50 లక్షల మంది పైగా ఉన్న డ్రైవర్ల సంక్షేమం కోసం గత ప్రభుత్వాలు ఇప్పటి ప్రభుత్వాలు పూనుకోవటం లేదు.కేరళ రాష్ట్రంలో లాగా డ్రైవర్ల భద్రత కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి,వాహన డ్రైవర్స్ ఆరోగ్యాలు,పిల్లలు చదువులు,ప్రమాదాలు జరిగినా సందర్భంలోనూ సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాలని అన్నారు,డ్రైవర్స్ కి భద్రత కల్పించాలినీ సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని,దేశంలో కార్మికహక్కులను హరిస్తూ తీసుకువస్తున్న ప్రమదభరిత 4లేబర్ కోడ్స్ అమలుచేయవద్దనీ దేశవ్యాప్తంగా జూలై 9 సమ్మెలో ట్రాన్స్పోర్ట్ డ్రైవర్స్ టైర్ బంద్ నిర్వహించి సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# పూతలపట్టు నియోజకవర్గం లో కె ఎస్ ఎస్ కమిటీ 100% పూర్తి చేసాము

**ఐరాల జూన్ 28 స్వర్ణసాగరం**

ఐరాల,పూతలపట్టు నియోజకవర్గం లో కె ఎస్ ఎస్ కమిటీ 100% పూర్తి చేస్తాము.గ్రామ కమిటీ అధ్యక్షులు , సభ్యులు 90 % చేయడం జరిగింది బూత్ యూనిట్ అండ్ క్లస్టర్ ఇంఛార్జి లు గా 95 % పూర్తి చేయడం జరిగింది ,మిగిలిన కమిటీలను కూడా త్వరలో పూర్తి చేస్తాంపూతలపట్టు నియోజకవర్గంఅబ్జర్వర్లు బొమ్మన్ శ్రీధర్

పార్టీ ఎన్నికల కమిటీ అబ్జర్వర్చిత్తూరు గ్రంథాలయ కమిటీ మాజీ అధ్యక్షులుతుమ్మల కన్నయ్య నాయుడుఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కమిటీ డైరెక్టర్

పూరిమిట్ల కుమారి,యాదమరి మండల అబ్జర్వర్ చిత్తూరు జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి చౌడప్ప,ఐరాల తెలుగుదేశం పార్టీ మండల స్థాయి స్థానిక సంస్థాగత ఎన్నికల సమావేశం పార్టీ విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, ప్రత్యేక పరిశీలకులు కన్నయ్య నాయుడు పూరి మిట్ల కుమారి, మండల పరిశీలకులు చౌడప్ప హాజరై, పార్టీ సంస్థాగత ఎన్నికల వ్యూహరచన, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు,సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ పరిశీలకులు మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని, తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి అందరికీ తెలియాల చేయాలని పిలుపు నిచ్చారు. మండలంలోని గ్రామాలు, వార్డుల వారీగా పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు,వచ్చే స్థానిక ఎన్నికల లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలి అని అందరూ కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కన్వీనర్ వడ్లపాటి గిరిధర్ బాబు మండల పార్టీ అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు , క్లస్టర్ ఇన్చార్జీ దేవాజి కో కన్వీనర్ నవీన్ పొలకల గ్రామ కమిటీ అధ్యక్షులు మునీంద్రా ప్రధాన కార్యదర్శి సాయి భరత్ యూనిట్ ఇంచార్జ్ లవ కుమార్ ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సొప్పా నాని నాయకులు బాల ప్రకాష్ ధరణి చిన్నబ్బా యతేంద్ర విక్రమ్ లాలూ శాయి తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవ వేడుకలు

**పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్ 28.**



మండలంలోని చెంబేడు గ్రామంలో 16వ అనంద అగ్నిగుండ మహోత్సవ వేడుకలు శనివారం స్థానికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయం నందు అగ్నిగుండ మహోత్సవ వేడుకల్లో భాగంగా విద్యుత్ దీపాలతో, చలువ పందేళ్ళతో అందంగా అలంకరించారు. మొదటి రోజు భక్తులు అందరూ సముద్ర స్నానం ఆచరించారు. మరుసటి రోజున శనివారం ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. మంగళ వాయిద్యములు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు నడుమ భజన గురువు గున్నయ్యదాస్ అగ్నిగుండంలో ప్రవేశించే వారికి కంకణం దారణ చేపట్టారు. పాండురంగస్వామి వారికి కలిశ పూజ ప్రారంభించి భజనలు ఆరంభం చేశారు. అక్కడ వేసిన భజనలలలో భాగంగా కోలాటము, పండరి భజన, జెండావరుస, కృష్ణ లీలలు, పాండురంగస్వామి దండకం ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. కంకణ ధారణ ధరించిన భక్తులంతా తొమ్మిది స్నానాలు ఆచరించి అగ్నిగుండ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.



### మామిడి రైతులు ఇ ఇబ్బందులు పట్టించుకోని ఎమ్మెల్యేకు...

# పుట్టినరోజు పండుగ అవసరమా..

### జిల్లా రైతు నాయకులు రామానాయుడు ఆవేదన

**శ్రీరంగరాజపురం :స్వర్ణ సాగరం: (జూన్ 28)**



నియోజకవర్గంలో మామిడి రైతులు గత నెల రోజులుగా తీవ్ర మనోవేదనకు గురై, నియోజకవర్గంలో ఉన్న జ్యూస్ ఫ్యాక్టరీ ఎదుట రాత్రనకా.. పగలనకా... కోతకు వచ్చిన కాయలు అమ్ముకోలేక మనోవేదనకు గురై రైతులు పడిగాపులు కాస్తుంటే.. నియోజకవర్గ ఎమ్మెల్యే మాత్రం సీఎం స్థాయిలో భారీ అంగుళార్భాటలతో పుట్టినరోజులు వేడుకలు చేసుకోవడం సమంజసం కాదని జిల్లా రైతు నాయకుడు రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన ఎమ్మెల్యే అంటే తన కళ్ళు ఎదురే చూస్తూ.. సెలబ్రేషన్ కి వెళ్లిన ఎమ్మెల్యేకి దారి పొడవున... మామిడి కాయలతో నిండిన ట్రాక్టర్లు స్వాగతం పలికింది. ఎమ్మెల్యే కు రైతులపై ఏమాత్రం కనికరం చూపడం లేదని తెలిసి వచ్చింది. రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందని... నియోజకవర్గంలో రైతులు బాగాలేదని... అలాగే నియోజకవర్గ పరిస్థితి దిగజారి పోవడం ఖాయమని రైతు నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ కు శుభాకాంక్షలు తెలిపిన పైనేని మురళి

**శ్రీరంగరాజపురం :స్వర్ణ సాగరం: జూన్ (28)**



గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు, శనివారం గంగాధర్ నెల్లూరు కార్యక్రమంలో భాగంగా శ్రీ రంగరాజపురం మండలం పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతున్న పైనేని మురళి ఎన్టీఆర్ కృష్ణావతారం మెమెంటు అందిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైనేని మురళి యువసేన పాల్గొన్నారు.

## సువార్త ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న జై భారత్ నేషనల్ పార్టీ నేతలు



**ముత్తుకూరు స్వర్ణ సాగరం జూన్ 28**

జై భారత్ నేషనల్ పార్టీ ముత్తుకూరు మండల నేత జెడి ఫౌండేషన్ సభ్యులు సామాజిక సేవా కార్యకర్త పల్లపు వీరబాబు తన నివాసంలో సువార్త కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి జెడి ఫౌండేషన్ సభ్యులు హాజరై సువార్త ప్రార్థనలు జరిపారు తాము ఈ భక్తి కార్యక్రమాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని జెడి ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు

## పేదింటి బాలికకు ట్రిపుల్ ఐటీ సీట్




**బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణసాగరం జూన్ 28**

శ్రీగోపాలకృష్ణపాఠశాలలో LKG నుండి 5,. ఐదవ తరగతి వరకు చదివి2025 . పదవ తరగతి పరీక్షలను 570. మార్కులు సాధించి నేడు నూజివీడులోని ట్రిబుల్ ఐటీ సీట్ ని సాధించినందుకు . ఈ పాఠశాల పూర్వ విద్యార్థిసాంబ్రాల నిహారిక .ను. గోపాలకృష్ణయ్య పాఠశాలలో శాలువుతో సత్కరించి . అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి పునాది ప్రాథమిక విద్య,. ప్రాథమిక విద్యకు చిరునామా శ్రీ గోపాలకృష్ణయ్య స్కూల్ అని ఈ సందర్భంగా తెలుపుతూ మా పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో విద్యార్థులందరికీ మంచి ఫౌండేషన్ కోర్సు నేర్పుతున్నామని . ప్లే వే . పద్ధతిలో (. చిన్నారులకు ఆట వస్తువులతో). నేర్పుతామని తెలిపారు. ఈ సందర్భంగా . సాంబ్రాల నిహారిక . మాట్లాడుతూ ఈ పాఠశాలలో నేను ప్రాథమిక విద్య నేర్చుకున్నాను శ్రీధర్ సార్ నన్ను ఎంతో . ప్రోత్సహించారు.. ఈ పాఠశాలకు నేను ఎంతో రుణపడి ఉన్నాను. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లి పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల రక్షణకే సేఫ్టీ కిట్..



**స్వర్ణసాగరం డోర్నకల్ జూన్ 28**

గీత కార్మికులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ కిట్ ను ఇవ్వనుందని మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ ఎస్సై మోనికా, తెలిపారు డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో శుక్రవారం రోజున కాటమయ్య ఆలయం వద్ద గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మోనికా మాట్లాడుతూ... గీతా కార్మికులకు వృత్తిలో ప్రమాదాలకు నివారించడానికి గ్రామంలో 27, మంది గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ మోకులకు తాటి చెట్టును ఎక్కే పద్ధతిని చుపెట్టినట్లు తెలిపారు.. తాటిచెట్టు ఎక్కుతూ పట్టు తప్పినా కింద పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సేఫ్టీ మోకులను సెలెక్ట్ అయిన 27, మంది గీత కార్మికులకు అందజేస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో చిలుకోడు గౌడ్ సంఘం అధ్యక్షుడు మంద రామారావు, మహబూబాబాద్ కేజికేఎస్ గౌని వెంకన్న,కేజికేఎస్,యమగాని వెంకన్న,ప్రకాష్, గ్రామ గౌడ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



**బంగారుపాళెం.స్వర్ణసాగరం.జూన్.28**

బంగారుపాళ్యం మండల పరిధిలోని నలగాంపల్లి గ్రామ పంచాయతీలోని పిడివి కండ్రిగ లోని జడ్పీ హైస్కూల్ నందు భారీగా ప్రజాపతినిధుల చేత స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి కె శిభ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్.పి జయచంద్ర నాయుడు, ఎన్ఆర్ఐ విక్రమ్,గారి తల్లీ శ్రీమతి శ్యామలమ్మ, పార్లమెంట్ బీసీ సంఘ అధ్యక్షులు బి నాగరాజు గౌడ్, పూతలపట్టు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు శ్రీమతి కృష్ణకుమారి, స్కూల్ కమిటీ అధ్యక్షులు గుణశేఖర్, హెచ్ఎం చిట్టెమ్మ మరియు ఉపాధ్యాయులు ఎస్సీ సెల్ అధ్యక్షులు కే స్వామి దాసు వీరి ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేయడం జరిగింది.

# గంగాధర్ నెల్లూరు నూతన తాసిల్దార్ కు.. పైనేని మురళి స్వాగతం సత్కారం



గంగాధర నెల్లూరు: శ్రీరంగరాజపురం) స్వర్ణసాగరం: (జూన్ 28)

గంగాధర్ నెల్లూరు మండలానికి నూతన తాసిల్దార్ గా వచ్చిన సికే శ్రీనివాసులు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షులు పోటీపడుతున్న పైనేని మురళి బృందం కలిసి స్వాగత సత్కారం చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవపత్ని ధనంజయ నాయుడు, మహేష్ నాయుడు, తదితర మిత్ర బృందం పాల్గొన్నారు.

# పాలూరు రవిరెడ్డి ని పరామర్శించిన మాజీ ఎం పి నెలవల



నాయుడుపేట స్వర్ణ సాగరం జూన్ 28

నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటూ, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ,ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విశ్రాంత బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి పాలూరు రవి రెడ్డిని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. పాలూరు రవిరెడ్డి త్వరగా పూర్తి ఆరోగ్యంగా కోరుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆకాంక్షించారు.ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, కరీంభాయి చెంచయ్య, ఆబోతుల బాబు తదితరులు ఉన్నారు.

# భారీ అంగు ఆర్భాటాలతో..ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ జన్మదిన వేడుకలు





గంగాధర నెల్లూరు( శ్రీరంగరాజపురం) స్వర్ణ సాగరం: జూన్ (28)

ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గంగాధర నెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో భారీ ఎత్తున జన్మదిన వేడుకలకు నాయకులు కార్యకర్తలు కలిసి భారీ హంగు ఆర్భాటాలతో శుభాకాంక్షలు వేదిక నిర్మించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సభకు రావడానికి ఎమ్మెల్యే దాదాపు ఒంటి గంటకు పైగా రావడంతో వచ్చిన జనాభా ఎండకు తట్టుకోలేక... పోయారు. ఉదయం 10 గంటల నుంచి మహిళలు భారీ కేట్లకు చేరుకొని.. ఎమ్మెల్యే రాక కోసం దాదాపు మూడు గంటలకు వేచి చూడము జరిగింది. ఎమ్మెల్యే సభా ప్రాంగణానికి చేరుకుని వెంటనే నాయకులు కార్యకర్తలు అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభకు వచ్చిన మహిళలకు భోజనం వసతి ఏర్పాటు చేశారు. జన్మదిన పురస్కరించుకొని సభకు వచ్చిన ప్రజానీకానికి దుస్తులు వితరణ చేశారు.

# శ్యామ్ ను దుశ్యాలతో ఘనంగా సన్మానించిన వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపా లక్ష్మి.

శ్రీరంగారాజపురం( స్వర్ణ సాగరం)



మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి యువ నాయకుడు శ్యామ్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సేవలను గుర్తించి గంగాధర నెల్లూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపాలక్ష్మి దృశ్యాలతో సన్మానించడం జరిగింది. మంగళవారం 49 కొత్తపల్లి మిట్ట వద్ద దీపిక కళ్యాణమండపంలో నిర్వహించు వైఎస్ఆర్సిపి నాయకుల సమీక్ష సమావేశంను వైఎస్ఆర్సిపి నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయుటకు కృషి చేయాలని శ్యాంకు సూచించారు.

# శ్రీకాళహస్తి మండలం, వేదం పంచాయతీలో అధికార దుర్వినియోగం






## గ్రామస్తులపై కేసులు పెడతామని బెదిరింపులు:

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

వేదం పంచాయతీలో ఎంఈఓ భువనేశ్వరి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. "మా బడి మాకు కావాలంటే కేసులు పెట్టమని కలెక్టర్ చెప్పారు" అంటూ గ్రామస్తులను బెదిరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ విషయంలో గ్రామస్తులతో ఎలాంటి చర్చలు లేకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిని కేసులతో బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.అధికారుల నిరంకుశ వైఖరి: "నేను చెప్పిందే వేదం, మేము చేసింది రాజ్యం" అన్నట్లుగా అధికారుల వైఖరి ఉందని, బ్రిటిష్ పరిపాలనను తలపిస్తోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన అధికారులని, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సేవకులని మరచిపోయి, తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిసు _న్నారు. గ్రామస్తుల అభిప్రాయాలను, సమస్యలను పట్టించుకోకుండా, తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, వారిపై కేసులు పెడతామని బెదిరించడం దారుణమని గ్రామస్తులు మండిపడుతున్నారు. న్యాయం జరగదన్న నిరాశ: ఏ అధికారి వచ్చినా న్యాయం జరగదని గ్రామస్తులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కోశాధికారితో సహా ఎవరూ స్పందించడం లేదని, తమ గోడు వినే నాథుడే లేడని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, ఎవరూ స్పందించకపోవడంతో న్యాయం జరుగుతుందనే ఆశను కోల్పోతున్నామని, తమ సమస్యలను పరిష్కరించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.కలెక్టర్ పైనే భారం: "కలెక్టరే చేయాలి, మాదేమీ లేదు" అంటూ ఎంఈఓ భువనేశ్వరి బాధ్యతను తప్పించుకుంటున్నారని గ్రామస్తుల ఆగ్రహం. "మా చెప్పిందే రాష్ట్రంలో అమలవుతుంది" అంటూ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారని, ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రశ్నించే హక్కు తమకు లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ స్థాయి అధికారి దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ విషయంలో జోక్యం చేసుకొని, వేదం పంచాయతీ గ్రామస్తులకు న్యాయం చేకూర్చాలని వారు కోరుతున్నారు. అధికారుల నిరంకుశ వైఖరి, బాధ్యతారాహిత్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయం...

## కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లికార్జున రావు

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 28



పీవీ నరసింహారావు కు ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలు చిరస్మరణీయమని కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు అన్నారు, శనివారం వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో జరిగిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిగా పివి నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొని వచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం జరిగిందన్నారు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభంలో పివి ఆర్థిక విధానాలు వలన భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతినలేదన్నారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలు తీసుకుని వచ్చి పేదవాడికి భూములు పంపిణీ చేసిన ఘనత పివి నరసింహారావుకు దక్కిందన్నారు, పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరిచిపోలేనిదని ఏపీఎన్జీవో అసోసియేషన్ కార్యదర్శి షేక్ అజరత్ అలీ అన్నారు, ఆంధ్రప్రదేశ్ తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు భారత ప్రధాని కావడం తెలుగువారికి గర్వంగా ఉందని బ్రాహ్మణ సంఘం నాయకులు ధూళిపాళ్ల వీరభద్రయ్య అన్నారు, పివి నరసింహారావు జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని యడవల్లి మాజీ సర్పంచ్ నారపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు, ముందుగా మాజీ ప్రధానిపీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు సంగరాజు సాయి మనోజ్, సింగంపల్లి రాంప్రసాద్, సాదు చలపతిరావు, పావని మురళి, సింగరాజు మాలకొండ ఈశ్వరరావు ప్రముఖ వ్యాపారవేత పైడిమర్రి శ్రీనివాసులు, మారెళ్ళ ఉమా కాంత్, వంశి,డివి రమణమూర్తి, సురభి పవన్, మహంకాళి ప్రసాదు, ఆర్వి సుబ్బయ్య, రామసుబ్బయ్య వికలాంగుల హక్కుల వేదిక కార్యదర్శి వేముల మైనర్ బాబు, టిడిపి నాయకులు బొగ్గరపు శ్రీనివాసులు, ప్రజా హక్కుల వేదిక కనిగిరి పట్టణ అధ్యక్షుడు బత్తుల సునీల్, దళిత హక్కుల వేదిక అధ్యక్షుడు గోన దానయ్య బీసీ సంఘాల నాయకులు పగ్గాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీని అభివృద్ధి చేయటమే ముఖ్య లక్ష్యం





## కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 28

కనిగిరి పట్టణంలోని వార్డులల్లో రహదారులకు ఇరువైపులా పిచ్చిచెట్లు,ముళ్లకంపలు దట్టంగా పెరిగిపోయిన వాటిని తొలగించి పట్టణాన్ని అభివృద్ధి చేయనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.కనిగిరి పట్టణంలోని 16వ వార్డులో చిల్ల చెట్లు పిచ్చి చెట్లు పెరిగిపోయి రాకపోకలు ఇబ్బంది కరంగా ఉందని మున్సిపల్ చైర్మన్ కు ఫిర్యాదు చేయగా జేసీబి సహాయంతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రపరిచడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూపరిసరాలు పరిశుభ్రముగా ఉండుట ద్వారా సీజనల్ వ్యాధులకు దూరమౌతామని అన్నారు. కనిగిరి పట్టణంలోని వారులల్లో రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చిల్ల చెట్లు పిచ్చి మొక్కలు కొమ్మలు వ్యాపించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నాని రోడ్డుకు ఇరువైపులా రహదారిపై వ్యాపించి ఉన్న పిచ్చి మొక్కలను,ముండ్ల చెట్ల కొమ్మలను జేసీబి సహాయం తో తొలగించడం జరిగింది.దీంతో రహదారి ఎప్పటిలాగా విశాలంగా మారడంతో వాహనదారులు, పాదాచారులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటేరీ రాజశేఖర్, పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మన అలమారాలో పాతవి - వారి జీవితంలో విలువైనవి





కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 28

మన అలమారాలో పాతవి –వారి జీవితంలో విలువైనవి అని కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం అన్నారు. శనివారం మహమ్మద్ సయనా బేగం సహకారంతో కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని కాశిరెడ్డి గిరిజన కాలనిలో పాత, కొత్త దుస్తులు పంపిణి చేశారు. పాత బట్టలు దానం చేయడం వలన పేదవారు, అవసరమైన వారికి సహాయం చేసినట్లవుతుందని అన్నారు.పేదవారికి బట్టల కొనుగోలు భారం తగ్గుతుందని దానం చేయడం వలన మనకు తృప్తి లభిస్తుందని కనిగిరి ఆర్ టి సి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం అన్నారు.దుస్తులు అందించిన డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం దంపతులకు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు తో పాటు కాలనీ వాసులు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత దుస్తులు పంపిణీ కార్యక్రమం ద్వారా సున్నితంగా ఉపయోగించిన దుస్తులను సేకరించి, అవసరమైన వ్యక్తులకు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు పాత దుస్తులను పారవేయకుండా, వాటిని తిరిగి ఉపయోగించే అవకాశం కల్పిస్తారని వాటిని పేదలకు, అవసరమైన వారికి సహాయం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని 9492413842 నెంబర్ కు తెలియపరిస్తే వెంటనే పాత కొత్త దుస్తులను సేకరించి అవసరమైన పేదలకు పంపిణి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో గుడ్ హెల్ప్ ప్రతినిధులు కుందుర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


# నిహారిక సినిమా నాయిక..



2024లో విడుదలై విమర్శకుల ప్రశంసలతోపాటు బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ అయిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యూత్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించిన ఈ చిత్రం ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అందించిన గద్దర్ అవార్డ్సులో జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుని సొంతం చేసుకుంది. అలాగే చిత్ర దర్శకుడు యదు వంశీకి ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా కూడా అవార్డ్ వచ్చిన విషయం తెలిసిందే. తొలి ప్రయత్నంలోనే అందరినీ మెప్పించిన ఈ సక్సెస్‌ఫుల్ బ్యానర్‌లో ఇప్పుడు రెండో సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందనున్న రెండో సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సోలో హీరోగా ఆయన నటిస్తున్న తొలి సినిమా ఇదే. గతంలో నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్సులో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ సరసన హీరోయిన్‌గా నయన్ సారిక నటిస్తుంది. 'ఆరు, క' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించిన ఆమె పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ నిర్మించిన జీ5 'హలో వరల్డ్', సోనీ లివ్ 'బెంచ్ లైఫ్' వంటి వెబ్ సిరీస్‌లతో తెలుగుకి పరిచయం అయ్యారు. ఇంకా ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శీను, సుఖ్వీందర్ సింగ్, అరుణ భిక్షు తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి మానస శర్మ కథ అందించగా, మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు.

# మహేష్ బాబు సినిమాలో బిగ్ బాస్ బ్యూటీ !

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమాలో చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో మహేష్ బాబు డిఫరెంట్ లుక్ లో కనిపించనున్నాడు. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే ఈ సినిమాలో మరికొంతమంది స్టార్ హీరోలు కూడా నటిస్తున్నారు. ఈ సినిమాను పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కిస్తున్నాడు రాజమౌళి. ఇదిలా ఉంటే ఇప్పుడు మహేష్ బాబుకు సంబంధించిన వార్త ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. మహేష్ బాబు సినిమాలో బిగ్ బాస్ బ్యూటీ నటించింది. ఆమె ఎవరో తెలుసా.? బిగ్ బాస్ హౌస్ లో తన ఆటతో ఆకట్టుకుంది హాట్ బ్యూటీ అశ్విని. బిగ్ బాస్ హౌస్ లో తన ఆటతో పాటు గ్లామర్ పరంగాను ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అశ్విని. ఇక ఈ ముద్దుగుమ్మ బిగ్ బాస్ హౌస్ లోకి రాక ముందు ఎక్కువ మందికి తెలియదు. ఆమె పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించింది. సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలోనూ అశ్విని నటించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఆ సినిమా మరేదో కాదు. సరిలేరు నీకెవ్వరు. మహేష్ బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హీరోయిన్ గా రష్మిక నటించింది. అయితే రష్మిక అక్క పాత్రలో అశ్విని నటించింది. రష్మిక పెద్దక్క పాత్రలో హరితేజ నటించగా.. రెండో అక్కగా నటించింది అశ్విని శ్రీ. ఈ సినిమాలో ట్రైన్ ఎపిసోడ్ హైలైట్ అనే చెప్పాలి. ఆ సీన్ లో అశ్విని కనిపిస్తుంది. ఈ విషయాన్నీ చాలా మంది నోటీస్ చేసి ఉండరు. ఇప్పుడు అశ్విని బిగ్ బాస్ పుణ్యమా అని క్రేజ్ తెచ్చుకోవడంతో ఆమె నటించిన సినిమా సీన్స్ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు నెటిజన్స్. ఇక ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. హాట్ హాట్ ఫోటోలు వీడియోలతో కుర్రకారును కవ్విస్తుంది అశ్విని. ఈ వారం నామినేషన్స్ అశ్విని కూడా ఉంది.



# చెత్తగా నటించావ్.. పోయి మానిటర్‌లో చూస్కోపో అని తిట్టడంతో ఏడ్చేశా..



విమర్శలు అందుకోని సెలబ్రిటీలు ఉండరు. ఏదో ఒక సందర్భంలో, ఏదో ఒక సినిమా రూపంలో వారు విమర్శలపాలవుతూనే ఉంటారు. హీరోయిన్ కీర్తి సురేశ్ కూడా అలా తిట్లు తినే ఇక్కడివరకు వచ్చిందట! ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ఉప్పు కప్పురంబు. సుహాస్ కీలక పాత్ర పోషించిన ఈ మూవీ అమెజాన్ ప్రైమ్‌లో జూలై 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో కీర్తి సురేశ్ తనను బాధపెట్టిన ఓ సంఘటనను చెప్పుకొచ్చింది.

**ఇప్పటికీ బాగా గుర్తు**

కీర్తి మాట్లాడుతూ.. ప్రియదర్శన్ సర్ డైరెక్ట్ చేసిన మలయాళ చిత్రం(గీతాంజలి)తో కథానాయికగా నా జర్నీ మొదలైంది. అప్పుడు జరిగిన ఓ సంఘటన నాకు చాలా బాగా గుర్తుంది. ఓ సన్నివేశం షూటింగ్ అయ్యాక.. ఎంత చెత్తగా చేశావో తెలుసా? వెళ్లి మానిటర్ చూసుకోపో అని తిట్టాడు. నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నాకు అది మొదటి సినిమా కావడంతో ఏడ్చేశాను. ఆయన అందరినీ అలానే అనేస్తాడు. ఆయన కూతురు, నటి కళ్యాణి ప్రిదయర్శన్‌ను కూడా అలాగే తిట్టేవాడు.

**అంతదాకా తెచ్చుకోను**

కానీ ఉప్పుకప్పురంబు డైరెక్టర్ అని శశి మాత్రం నటీనటులకు చాలా స్వేచ్ఛ ఇస్తాడు. ఈయన ఆవేశంతో తిట్టేవరకు పరిస్థితులు చేయిదాటిపోనివ్వను. అప్పటికే ఆయన చెప్పిన సీన్‌లో బాగా నటిస్తాను. ఇంకో విషయమేంటంటే.. ఈ డైరెక్టర్ మంచి నటుడు కూడా! చాలామంది డైరెక్టర్లు చెప్తారంతే.. కానీ ఈయన ఎలా యాక్ట్ చేయాలని చేసి చూపిస్తాడు అని కీర్తి సురేశ్ చెప్పుకొచ్చింది. గీతాంజలి చిత్రంతో హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టిన కీర్తి సురేశ్.. తెలుగులో నేను శైలజ, నేను లోకల్, మహానటి, రంగ్‌దే, దసరా, సర్కారువారిపాట వంటి పలు చిత్రాల్లో నటించింది. కల్కి 2898 ఏడీ చిత్రంలో ప్రభాస్ వాడే కారుకు వాయిస్ ఓవర్ ఇచ్చింది.



# ఎస్.జె.సూర్య దర్శకత్వంలో 'కిల్లర్'

దాదాపు పది ఏళ్ల విరామం తర్వాత మళ్లీ దర్శకుడిగా రీఎంట్రీ ఇవ్వడానికి ఎస్.జె. సూర్య సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రూపొందు తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కిల్లర్'. ఈ చిత్రంలో ఆయన హీరోగానే కాకుండా కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా సమకూరుస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గొకులం మూవీస్ (గోకులం గోపాలన్ నేతృత్వంలో) ఎస్‌జె సూర్య సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, మలయాళ, కన్నడ తదితర భాషలలో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన గొకులం మూవీస్ ఈ సినిమాతో తమిళ సినీ రంగంలోకి ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా వి.సి.ప్రవీణ్, బైజు గోపాలన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కృష్ణమూర్తి వ్యవహరిస్తున్నారు. 'వాలి', 'ఖుషీ', 'న్యూ' వంటి క్లాసిక్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్‌జె సూర్య ఈ సినిమాకు భారీ తారాగణాన్ని తీసుకొస్తున్నారు. అంతే కాదు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఐదు భాషలలో విడుదల కానున్న ఈ చిత్రం శుక్రవారం పూజా కార్యాక్రమాలతో ప్రారంభమైంది. హీరో కార్తీ హాజరై టీమ్‌ని అభినందించారు. 'కిల్లర్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే స్థాయి సినిమా ఇవ్వాలనే సంకల్పం మాది. దేశవ్యాప్తంగా ప్రతిభ గల నటులు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రంగా రూపొందించబోతున్నాం' అని నిర్మాతలు తెలిపారు.